ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 26.0



లక్ష మార్కు దాటేసింది

అప్పుడు కొనలేకపోయాం.. ఇప్పుడు కొనగలమా ?

» ఎక్కడ చూసినా.. పసిడిపైనే చర్చ

» ఇంకా పెరగవచ్చంటున్న బులియన్ వర్గాలు

నరసాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో డిపాజిట్ చేసుకుంటే ఏడాదికి రూ.లక్షకు రూ.6 వేలు మాత్రమే వడ్డీ వస్తుంది. అదే రియల్‌ఎస్టేట్‌లో లక్షలు పెట్టుబడి పెట్టి స్థలం కొంటే వచ్చే మొత్తానికి గ్యారెంటీ ఉండదు. మార్కెట్ బాగుంటే పది నుంచి 20 శాతం లాభం మిగులుతుంది. స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే ఎప్పుడు ఎలా ఉంటుందో.. చెప్పలేని పరిస్థితి. మార్కెట్ పెరిగితే లక్షకు రూ.10 వేలు లాభం, లేకపోతే పెట్టిన సొమ్ములో సగం కూడా మిగలదు. డాలర్ పరిస్థితి ఇంతే. ఐదేళ్లల్లో ఈ మార్కెట్‌లను క్షుణ్ణంగా పరిశీలించిన మదుపుదారులు, ప్రజలు రూటు మార్చారు. బంగారంపై పెట్టుబడులు పెడుతూ వచ్చారు. ఇలా పెట్టిన వారికి ఏటా 15 నుంచి 19 శాతం లాభాలు చవిచూశారు. అయితే ఈ జనవరి నుంచి బంగారం అంచనాలకు మించి పెరిగింది. డిసెంబరు నాటికి బంగారం బిస్కెట్ పది గ్రాములు రూ.లక్షకు వెళ్లవచ్చని అంచనా వేశారు. నాలుగు నెలల్లోనే రూ.లక్ష దాటేసింది. ఇదే విధంగా పెరిగితే.. ఈ ఏడాది చివరికి గ్రాము బంగారం రూ.12 వేలయ్యే అవకాశం ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఆ రోజుల్లో కొని ఉండాల్సింది!

జిల్లాలో మంగళవారం ఎక్కడ చూసినా.. బంగారంపైనే చర్చ సాగింది. ధర రూ.లక్షకు చేరడం ప్రజలు ఆసక్తిగా చర్చించుకున్నారు. మహిళల దగ్గర నుంచి పురుషుల వరకు ఎక్కడ నలుగురు కలిసినా.. దీనిపైనే చర్చ. గత ఏడాదిలో అనవసరంగా రూ.50 లక్షలు పెట్టి సైట్ కొన్నాం. ఆ ధర అలాగే ఉంది. అదే బంగారం కొనుంటే.. రూ.15 లక్షలు లాభం ఉండేది. ఇప్పుడు ఈ రేటుకు బంగారం కొనగలమా ? అన్న సంభాషణ ఎక్కడ చూసినా.. వినిపించింది. మరికొందరు కొందామని సిద్ధమయ్యాం. కానీ ధర తగ్గుతుందని చెప్పడంతో వెనక్కి వచ్చాం. అనవసరంగా కొనలేకపోయాం. పెరిగిన ధరతో వస్తువులు చేయించుకోగలమా అన్న నిరాశను వెలిబుచ్చారు.

మళ్లీ షాపులు కళకళ

వచ్చే నెలలో అక్షయ తృతీయ వస్తుంది. దీనికితోడు ధర మరింత పెరిగే ఛాన్స్ ఉందన్న వాదనలు బులియన్ మార్కెట్‌లో వినిపిస్తున్నాయి. దీంతో రెండు రోజుల నుంచి బులియన్ బజార్లలో సందడి నెలకొంది. గతంలో కొందామని ధరను చూసి వెనక్కి వెళ్లిన వారు ఇంకా పెరుగుతుందన్న భయంతో రేటును సైతం లెక్క చేయకుండా వస్తువులను కొనేందుకు మార్కెట్‌కు వస్తున్నారు. మరికొందరు బంగారాన్ని కొని దాచుకునేందుకు రెండు, మూడు గ్రాముల చొప్పున స్తోమతను బట్టి కొనుగోలు చేస్తున్నారు. దీంతో షాపుల్లో కస్టమర్ల కళ కనిపించింది.

నరసాపురానికి చెందిన ఓ మధ్య తరగతి కుటుంబం వచ్చే ఏడాది తమ కుమార్తెకు వివాహం చేయాలని నిర్ణయించుకున్నారు. దానికి రెండేళ్ల నుంచి బంగారం కొంటూ వస్తున్నారు. అయితే ఈ ఏడాది జనవరి నుంచి ధర పెరగడంతో తగ్గినప్పుడు కొందామని వాయిదా వేశారు. ఒక్కసారిగా గ్రాముకు మూడు నెలల్లో రూ.3 వేలు పెరగడంతో అవాక్కయ్యారు.

గత ఏడాది వరలక్ష్మి వ్రతానికి భీమవరానికి చెందిన ఓ మహిళ చెరువుల్లో వచ్చిన సొమ్ముతో 50 కాసులు పెట్టి వడ్డానం చేయించుకుంది. అప్పుడు ఈ ధర గ్రాము రూ.6,300 ఉంది. ఇంత ధర పెట్టి కొనాలా ? తగ్గినప్పుడు కొనచ్చులే..! అని కుటుంబ సభ్యులు చెప్పినా.. ఆమె పట్టు పట్టి కొనిపించింది. ఇప్పుడు పెరిగిన ధర చూసి షాక్ తింటు న్నారు. ఆ రోజు కొనకుంటే ఇప్పుడు రూ.12 లక్షలు అదనంగా పెట్టి కొనాల్సి వచ్చేది కదా ! అంటూ కుటుంబ సభ్యులంతా ఆమెను మెచ్చుకుంటున్నారు.





ఈ రేటుకు అసలు కొనలేం

చెరుకూరి అన్నపూర్ణ, నరసాపురం

ధర ఇంత పెరుగుతుందని ఎవరూ ఊహించలేదు. ఏదో పెరిగి తగ్గుతుందని భావించాం. కానీ మూడు నెలల్లో రూ.లక్షకు వెళ్లడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ధరలో గ్రాము బంగారం కొనాలంటే రూ.10 వేలు ఉండాలి. సామాన్య, మధ్య తరగతులకు ఇది చాలా కష్టం. గతంలో మాదిరి మూడు, నాలుగు కాసులతో వస్తువులు చేయించుకోవడం సాధ్యం కాని పని..

2024 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకూ బంగారం ధర పెరిగిన క్రమం..

పది గ్రాములు	24 క్యారెట్లు	22 క్యారెట్లు
ఏప్రిల్ 25	1,01,350	92,900
మార్చి 25	94,000	86,000
ఫిబ్రవరి 25	84,890	80,850
జనవరి 2025	84,330	78,000
డిసెంబరు 24	78,000	71,500
నవంబరు 24	80,560	73,850
అక్టోబరు 24	76,910	70,500
సెప్టెంబరు 24	73,040	66,950
ఆగస్టు 24	70,360	64,500
జూలై 24	72,280	66,250
జూన్ 24	72,550	66,500
మే 24	71,510	65,550
ఏప్రిల్ 2024	69,380	63,600

మరింత పెరగొచ్చు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల భయం, డాలర్, అమెరికాలో బాండ్ల రేట్ల పతనం, స్టాక్ మార్కెట్‌లో ఒడి దుడుకులతో మదుపుదారులు పెట్టుబడుల రూట్లను మార్చారు. బంగారంపై పెట్టుబడి పెడితే రాబడికి ఢోకా ఉండదన్న ధీమాకు వచ్చారు. దీనికి అనుగుణంగానే బంగారం కూడా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఈ ధర ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ తగ్గినా.. అది నామమాత్రమే, మళ్లీ పెరిగే ఛాన్స్ ఉంది.



అజిత్‌కుమార్ జైన్, జిల్లా బులియన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు



విద్యార్థులతో కలెక్టర్ వెట్రిసెల్వి

లక్ష్య సాధనకు కష్టపడి చదవాలి : కలెక్టర్

బుట్టాయగూడెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం అకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. ఇష్టపడి చదివితే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని సూచించారు. పదో తరగతి తర్వాత అవకాశాలు ఉన్న కోర్సులను ఎంచుకుని ముందుగా సాగాలని తెలిపారు. సోషల్ మీడియాకు, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులను, గురువులను దైవంగా భావించి గౌరవించాలన్నారు. పాఠశాల గదులను, పరిసరాలను, మరుగుదొడ్లను, ల్యాబ్‌లను పరిశీలించారు. హెచ్ఎం గంగాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లోకుమూడిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ కిషోర్

హెల్మెట్ ధరించకపోతే పోలీసులైనా ఫైన్ కట్టాల్సిందే : ఎస్పీ

మండవల్లి ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని, పోలీసులైనా ధరించాలని లేదంటే అపరాధ రుసుం కట్టాల్సిందేనని ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండవల్లి పోలీసుస్టేషన్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో క్రైం తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ రవికుమార్, మండవల్లి ఎస్ఐ సీహెచ్ రామచంద్రరావు, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు, కైకలూరు మానవత అధ్యక్షుడు కొండ్రెడ్డి చిట్టెమ్మ, కొండ్రెడ్డి సత్యనారాయణ, మండవల్లి మానవత అధ్యక్షుడు గుడివాడ గణేశ్, గుర్రం శ్యామ్ కుమార్, తలారి వేణుగోపాలరావు, విఠల్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పులపర్రులో రోడ్డు ప్రమాదాల నివారణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. రాత్రి సమయాల్లో రోడ్లపై పశువులు సంచరించడం వల్ల వాహనదారులకు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని, పశువులు కనిపించేలా రేడియం బెల్టులను పశువులకు ఏర్పాటు చేసేందుకు పాడిరైతులకు అందజేస్తున్నట్టు ఎస్పీ వెల్లడించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో లోకుమూడి ప్రధాన సెంటర్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎస్పీ ప్రారంభించారు.

నేడు టెన్త్ ఫలితాలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో జరిగిన పదో తరగతి రెగ్యులర్, 'ఓపెన్' టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు బుధవారం 10 గంటలకు విడుదల కానున్నాయి. రెగ్యులర్ పరీక్షలకు 25,179 మంది, దూరవిద్య టెన్త్ పరీక్షలకు 793 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకున్నారు. ఫలితాలను పాఠశాల విద్య అధికారిక వెబ్‌సైట్ బీఎస్ఈ.ఏపీ.జీవోవీ. ఐఎన్‌తో పాటు, మనమిత్ర వాట్సాప్ నంబరు 95523 00009 నుంచి, టీచర్ల మొబైల్ యాప్ 'లీప్' నుంచి తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



కటుకూరులో కొమ్ముపాగా ధరించి గిరిజనుల సంప్రదాయ నృత్యంలో పాల్గొన్న మంత్రి మనోహర్. చిత్రంలో ఎమ్మెల్యేలు బాలరాజు, ధర్మరాజు

లోపలి పేజీలో..



ఆఫ్‌లైన్ లేఅవుట్‌లకు.. మోక్షం

మార్కెట్ ఫీజులో 50 శాతం చెల్లించి పునరుద్ధరణకు అవకాశం

» స్థానిక సంస్థలకు సమకూరనున్న ఆదాయం

» పాత ఫైళ్లకు బూజులు దులిపే పనుల్లో టౌన్ ప్లానింగ్ సిబ్బంది

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

నగరాలు, పట్టణాల్లో ఆఫ్‌లైన్ (మాన్యువల్) విధానంలో అనుమతులు తీసుకున్న లే-అవుట్‌ల్లో పనులు పూర్తి చేయని వాటిని తిరిగి పునరుద్ధరించుకోవడానికి రియల్టర్లకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీనివల్ల పురపాలక, కార్పొరేషన్లకు ఆదాయం సమకూరనుంది. 2018కు ముందు లే-అవుట్లు మంజూరు పొందిన రియల్టర్లు అక్కడ లే-అవుట్లు వేశాక ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా కాల పరిమితి ముగిసిన వాటిని మార్కెట్ ఫీజులో 50 శాతం చెల్లించి తాజాగా పునరుద్ధరణకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు అవకాశం కల్పించారు. జాప్యం జరిగిన సంవత్సరాలకు గడువు పూర్తయిన తర్వాత కాలాన్ని పరిగణనలోకి తీసుకుని ఆలస్యపు ఫీజు వసూలు చేసి వాటికి అనుమతిలిస్తారు. ప్రస్తుత కరెంట్ గెజిట్ రేట్స్ వసూళ్లు చేస్తారు. రియల్టర్లు నుంచి వచ్చిన విజ్ఞప్తులతో పాటు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ప్రతిపాదించిన అంశాలను, చేయాల్సిన లే-అవుట్లపై పురపాలకశాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదించగా, ఈ ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ లభించింది. గతంలో వైసీపీ ప్రభుత్వం లే-అవుట్ల వ్యవహారంలో భారీ ఫీజులు వసూళ్లకు పాల్పడడం, భూ మార్పిడి ఫీజును 3 శాతం నుంచి 5 శాతం వసూలు చేయడం వల్ల రియల్టర్లు ఆశలు వదిలేసుకున్నారు. ప్రభుత్వం తాజాగా ఇచ్చిన రీవ్యాలిడేషన్ ప్రక్రియతో పాత రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు కొంత ఊరట లభించినట్లే. జిల్లా కేంద్రమైన ఏలూరు విషయానికి వస్తే ఏడు గ్రామ పంచాయతీలు విలీనం కావడంతో.. అక్కడ నిలిచిన లే-అవుట్లపై ఆదాయం సమకూరనుంది. కొత్తగా చింతలపూడి, జంగారెడ్డిగూడెంలకు ఆదాయం సమకూ ర నుంది. నూజివీడు కాస్తోకూస్తో ఆదాయం లభించనుంది. ఇక్కడ మామిడి పొలాలను నరికేసి లే-అవుట్లను వేశారు.

పాత వాటికి బూజులు దులపాల్సిందే..

దాదాపుగా ఏడేళ్ల క్రితమే లే-అవుట్లు మంజూరులు పొందిన వారి ఫైళ్లను పురపాలక సంఘాల్లో పాత వాటికి బూజులు దులపాల్సి వచ్చింది. అవి ఎక్కడున్నాయో వెతికే పనుల్లో అధికారులు నిమగ్నం అయ్యారు. పాత పాలకవర్గాలు అటు,ఇటూ మారడం, అప్పటి అధికారులు ఇక్కడ పనిచేయకపోవడంతో పాత ఫైళ్లపై కమిషనర్లే ప్రత్యేక చొరవ తీసుకోవాల్సి ఉంటుంది. దీనిపై త్వరలోనే జిల్లా స్థాయిల్లోను అర్బన్ అథారిటీ స్థాయిలో, రాజమండ్రి టౌన్‌అండ్ కంట్రీప్లానింగ్ రీజినల్ డైరక్టర్ పరిధిలోను రియల్టర్లతో సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. ఇది మున్సిపాల్టీలకు, కార్పొరేషన్‌లో విలీనమైన పంచాయతీలకు ఉపయోగంగా ఉంటుందని, రియల్టర్లు ఆలస్యం రుసుంతో పాత వాటిని పునరుద్ధరించుకోవడానికి ముందుకు రావాలని టౌన్‌అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ పి.శ్రీనివాసమూర్తి కోరారు. ఆయా మున్సిపాల్టీలు, అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు.

అమ్మోనియా గ్యాస్ లీక్.. ఐదుగురికి గాయాలు

పాలకోడేరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మోగల్లులోని వశిష్ఠ మెరైన్ రొయ్యల ఫ్యాక్టరీలో అమ్మోనియా గ్యాస్ లీకై మంగళవారం రాత్రి ఐదుగురికి గాయాలయ్యాయి. రోజులానే కార్మికులు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి ఒక్కసారిగా అమ్మోనియా గ్యాస్ లీకవడంతో ఆ ప్రాంతంలోని శ్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. ఈ ఘటనతో అక్కడ పనిచేస్తున్న ఐదుగురికి బలమైన గాయాలయ్యాయి. వీరిని భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒక యువతిని ఐసీయులో ఉంచి చికిత్స చేస్తున్నారు. పాలకోడేరు పోలీసులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ప్రమాదం జరిగిందని చెబుతున్నారని, తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. భీమవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ పొందుతున్నట్లు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిందని తమకు పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

గిరిజన ఆశ్రం పాఠశాలలకు 'పాల్' ట్యాబ్‌ల అందజేత



ఏలూరు అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : తరగతికి అనుగుణంగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడం ద్వారా గణితం, తెలుగు, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని పట్టు సాధించేలా ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నిధులతో ఏర్పాటైన 'పాల్' (పర్సనలైజ్డ్ అడాప్ట్ లెర్నింగ్) ల్యాబ్‌లకు మంగళవారం స్థానిక సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఇప్పటికే జిల్లాలో 'పాల్' ల్యాబ్‌లు ఏర్పాటైన 18 ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లను అందజేయగా, తాజాగా బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 14 గిరిజన సంక్షేమ ఆశ్రం పాఠశాలలు, కేజీబీవీలకు సరఫరా చేశారు. ఒక్కో స్కూలుకు 30 చొప్పున సాంసంగ్ ట్యాబ్‌లను అందజేశారు. సంబంధిత పాఠశాలల్లో పాల్ కంప్యూటర్ ల్యాబ్‌లలో ట్యాబ్‌లను వినియోగించేందుకు వీలుగా విద్యుత్ పరికరాల కోసం ఒక్కో స్కూలుకు రూ.22వేలు చొప్పున విడుదల చేశారు. ఆయా సబ్జెక్టుల్లో పాఠ్యాంశాల కంటెంట్‌ను థర్డ్‌పార్టీ ఏజన్సీ నిక్షిప్తం చేసి ట్యాబ్‌లను పంపిణీ చేస్తుంది. గణితంలో వారానికి మూడు, ఇంగ్లీషు, తెలుగు సబ్జెక్టుల్లో ఒక పీరియడ్ చొప్పున 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు - మిగతా 8లో

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

పశువుల ఆసుపత్రులలో డాక్టర్ల కొరత, సిబ్బంది నిర్లక్ష్యం, పశువులకు సరైన వైద్యం అందకపోవడం, వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాకపోవడం, సరిగా మందులు ఇవ్వకపోవడం, పశువుల వ్యాధులపై 23వ తేదీ బుధవారం ఉదయం 11-12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహిం చనుంది. పాడి, పశువుల రైతులు 99899 32844 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.గోవిందరాజు చర్యలు తీసుకుంటారు.

ఉపాధి కూలీలకు ఊరట

» వేతన బకాయిల చెల్లింపునకు సన్నాహాలు

» జిల్లాలో 2.38 లక్షల కూలీలకు చెల్లించాల్సిన మొత్తం రూ.63 కోట్లు

ఏలూరు సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉపాధి కూలీలకు వేతన బకాయిలను త్వరితగతిన చెల్లించేలా టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వేతన బకాయిలు విడుదల అయ్యాయి. రాష్ట్రంలోని ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఉపాధి హామీలో పనులు చేసిన కూలీలకు వారి బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ కానున్నాయి. మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకపోవడం వల్ల వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వేతన బకాయిలు కోసం ఎంతో కాలంగా వారు ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు బకాయి వేతనాలు చెల్లించడానికి నిధులు విడుదల చేస్తుండటంతో ఉపాధి కూలీలకు ఊరట లభించింది. గత ప్రభుత్వ హయాంలో వేతన బకాయిలు ఎప్పటికప్పుడు చెల్లించకపోవడం, ఉపాధి నిధులను వేరే పథకాలకు దారి మళ్లించడం వంటి కారణాలతో వేతనాల బకాయిలు పేరుకుపోయేవి. చెల్లింపులు కూడా సక్రమంగా జరిగేవి కావు. టీడీపీ ప్రభుత్వం వచ్చాకా ఉపాధి కూలీల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించింది.

జిల్లాలో కూలీల సంఖ్య 2.38 లక్షలు

జిల్లాలో 1,19,470 జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో ఉపాధి హామీ పనులకు సంబంధించి 2,38,940 మంది కూలీలు పనులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ జనవరి నెలాఖరు వరకు వేతనాలు చెల్లింపులు జరిగాయి. అయితే 2025 ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు మూడు నెలల పాటు వేతనాలు చెల్లించాల్సి ఉంది. దీనికి సంబంధించి జిల్లాలో వేతన బకాయిలు రూ.63 కోట్లు వరకు ఉన్నాయని డ్వామా శాఖాధికారుల నివేదికలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది.

రెండు రోజుల్లో బ్యాంకు ఖాతాలకు జమ

ఉపాధి కూలీలకు అందాల్సిన వేతన బకాయిలు ఒకట్రెండు రోజుల్లో వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయి. ఇప్పటికే జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ వేతన బకాయిలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలో కొన్ని రోజుల వరకు ఉన్న వేతన బకాయిలు రూ.63 కోట్లు విడుదల కానున్నాయి.

- కేవీ సుబ్బారావు, డ్వామా పీడీ

తల్లి రుణం తీర్చుకుంటా !



స్కూటర్‌పై తల్లితో పుణ్యక్షేత్రాల దర్శనం

ఎనిమిదేళ్లుగా నాలుగు దేశాల్లో యాత్ర

కుక్కునూరులో ఆంధ్రజ్యోతితో కృష్ణకుమార్

కుక్కునూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన తల్లికి సేవ చేయాలి...చిన్నప్పటి నుంచి వంటింటికే పరిమితమైన తల్లి సమీప గ్రామంలోని గుడికి కూడా వెళ్లలేదు. ఇది తెలిసి తన జీవితం తల్లి సేవకే అంకితం చేసి బ్రహ్మచారిగా జీవిస్తూ సమగ్ర భారతదేశంలో పుణ్యక్షేత్రాలు, పవిత్ర స్థలాలు అన్ని చూపిస్తున్నాడు మైసూర్‌కు చెందిన దక్షిణామూర్తి కృష్ణకుమార్.. మంగళవారం కుక్కునూరు విచ్చేసిన ఆయన రామాలయం వద్ద ఆంధ్రజ్యోతితో తన అనుభవాలను పంచుకున్నారు.2018 జనవరి 16న మా తండ్రి ఇచ్చిన స్కూటర్‌పై తల్లి చూడా రత్నమ్మను వెనుక ఎక్కించుకుని యాత్ర ప్రారంభించాను. రోజుకు 150 నుంచి 200 కిలోమీటర్లు ప్రయాణిస్తూ ఇప్పటి వరకు దేశంలోని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సంపూర్ణ భారతదేశ యాత్ర చేశాను. పొరుగు దేశాలు నేపాల్, భూటాన్, మయన్మార్ దేశాల్లో ప్రసిద్ధ ఆలయాలు దర్శించుకున్నాం. 25 ఏళ్ల వరకు ఒక కార్పోరేట్ కంపెనీలో ఉద్యోగం చేసి సంపాదించిన డబ్బు తల్లి అకౌంట్‌లో వేశానని వచ్చిన వడ్డీ డబ్బులతోనే ఈ యాత్ర పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రముఖ కంపెనీ మహీంద్ర ఛైర్మన్ ఆనంద్ మహేంద్ర ఒక కారును కూడా తనకు బహుకరించారని అది ఇంటి వద్దే ఉంచానని అత్యవసర సమయంలో వాడుతున్నట్లు తెలిపారు. తన తల్లి రుణం తీర్చుకోవడానికి ఈ యాత్ర చేసినట్లు తెలిపారు.



ద్వారకాతిరుమల ఉగాది మండపం సమీపంలో మార్కింగ్ ఇస్తున్న అధికారులు

ద్వారకాతిరుమలలో రహదారి విస్తరణ పనులు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో రహదారి విస్తరణ పనులకు మరోసారి అధికారులు మార్కింగ్‌లు ఇచ్చారు. ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి ఇరు వైపులా ఉన్న ఆక్రమణలను గుర్తించారు. రహదారికి ఇరువైపులా పలు ప్రాంతాల్లో మార్కింగ్‌లు ఇచ్చి విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతేడాది డిసెంబరు 20న వచ్చి మార్కింగ్‌లు ఇచ్చిన అధికారులు ఆ తరువాత ఆ ఊసే ఎత్తలేదు. గత కొద్దికాలంగా ప్రధాన రహదారి విస్తరణ పనులు కోర్టుల్లో స్టే ఉన్న కారణంగా నిలిచిపోయాయి. క్షేత్రంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతుండటంతో ఈ విస్తరణ అవసరమని తలచి ఆర్‌అండ్‌బీ రహదారిపై ఆక్రమణలను గుర్తిస్తూ మార్కింగ్‌లు ఇస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ ఏవీ సుబ్బరాయన్ తెలిపారు. క్షేత్రాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్న ఆయన వివరించారు.

ఆక్రమణదారులకు నోటీసుల జారీలో జాప్యం

రహదారి విస్తరణలో భాగంగా ఆక్రమణదారులకు గృహ యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు గతేడాది డిసెంబరు 24నే రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ఆర్ అండ్‌బీ, పంచాయతీ అధిదికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ఏ మేరకు ఆక్రమణలు తొలగించాలి ? ఎంత వెడల్పులో రోడ్డు నిర్మాణం చేయాలి ? అన్న అంశంపై చర్చించుకున్నారు. తరువాత ఆక్రమణల తొలగింపుపై ఉలుకు పలుకు లేకపోవడంతో ఇది మరుగున పడిందని స్థానికులు భావించారు. ఆక్రమణల తొలగింపు వ్యవహారం మరోసారి తెరపైకి రావడంతో గ్రామంలో చర్చనీయాంశమైంది.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిటివి శ్రీనివాస్, వీఆర్‌వో మహాలక్ష్మి, విలేజ్ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.



అడవిపాలెంలో మంత్రి నిమ్మల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

మంత్రి చొరవతో అడవిపాలెంలో ఉపాధిహామీ పనులు

యలమంచిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు మున్సిపాలిటీలో విలీనం కాకుండా నిలిచిపోయిన గ్రామాల్లో ఒకటైన అడవిపాలెం గ్రామంలో 2020 నుంచి గ్రామీణ ఉపాధిహామీ పనులు నిలిచిపోయాయి. ఈ అంశంపై రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ప్రత్యేక దృష్టి సారించి ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు అనుమతులు తీసుకువచ్చారు. దీంతో ఐదేళ్లుగా అడవిపాలెంలో నిలిచిపోయిన గ్రామీణ ఉపాధిహామీ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. అడవి పాలెంలో మంగళవారం ఎంపీడీవో ప్రేమాన్విత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఉపాధిహామీ పనులు ప్రారంభానికి కృషి చేసిన మంత్రి రామానాయుడు చిత్ర పటానికి ఉపాధి హామీ కూలీలు పాలాభిషేకం చేశారు. అనంతరం ఎన్డీఏ కూటమి నాయకులు ఉపాధిహామీ కూలీలకు జాబ్ కార్డులు అందజేసి పనులను ప్రారంభించారు. కూటమి నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపి, చెరుకూరి అంజిబాబు, బోనం నాని, ఆరుమిల్లి చిన్ని, రుద్రరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నవ్విపోదురు గాక..

రెండో రోజు సెమిస్టర్ పరీక్షల్లోనూ అదే సీన్ రిపీట్

'చూచిరాతల ఫీజు' చెల్లించిన వారికే 'సౌకర్యం'



ఏలూరు అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మూకుమ్మడి చూచిరాతలతో ఆంధ్ర విశ్వ విద్యాలయం దూరవిద్య యూజీ, పీజీ సెమిస్టర్ తొలిరోజు పరీక్షలు జిల్లాలో అపహాస్యం పాలు కాగా, మంగళవారం రెండో రోజు పరీక్షల్లోనూ అదే సీన్ రిపీట్ అయినట్టు తెలిసింది. జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో జరుగుతున్న ఈ పరీక్షలు నిర్వహిస్తోన్న కొన్ని కేంద్రాల్లో డబ్బులిచ్చే పరీక్షార్థులకు వివిధ పద్ధతుల్లో 'పాస్ గ్యారెంటీ' స్కీంను అమలు చేస్తున్నట్టు సోమవారం ఆరోపణలు వచ్చిన విషయం విధితమే. పరీక్షల్లో అక్రమాలపై యూనివర్సిటీ అధికారవర్గాలు మంగళవారం నుంచి దృష్టి సారిస్తాయని, ఆ మేరకు పరీక్షలు పారదర్శకంగా జరుగుతాయని భావించగా, ఆయా కేంద్రాల్లో పరీక్షలు జరిగిన తంతును గమనిస్తే నిఘావర్గాలు నిద్ర పోతున్నాయా ? లేదంటే ప్రలోభాలకు లొంగిపోయారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం ఉదయం జరిగిన పీజీ సెమిస్టర్ పరీక్షలకు హాజరైన విద్యార్థుల నుంచి పేపర్‌కు రూ.2500 చొప్పున ' ఫీజు'ను డిమాండ్ చేసిన కొన్ని కేంద్రాల ప్రతినిధులు ఆ మేరకు డబ్బులు ఇచ్చినవారిని ఒక గదిలో మూకుమ్మడిగా బల్లలపై కూర్చోబెట్టి జవాబులు రాసిన జిరాక్స్ కాపీలు అందించి పరీక్షలు రాయించారని సమాచారం. ఇక నిర్దేత ఫీజు ఇవ్వనివారిని పరీక్ష మరోగంటలో ముగిసే సమయంలో ప్రశ్నాపత్రం, బుక్‌లెట్ ఇచ్చి మరోగదిలో రాసుకోవడానికి కనికరం చూపారని ప్రచారం జరుగుతోంది. ఈ అక్రమాలపై బయటకు వచ్చి ఫిర్యాదు చేస్తే తమ భవిష్యత్తుపై ప్రభావం పడుతుందన్న భయాందోళనలతోనే పలువురు పరీక్షార్థులు మిన్నకుండిపోతున్నట్టు సమాచారం. ఇప్పటికైనా యూనివర్సిటీ ఉన్నతాధికారులు నేరుగా జోక్యం చేసుకుంటే తప్ప చూచిరాతల సెమిస్టర్లను అడ్డుకోవడం ఎవరితరం కాదని తెలుస్తోంది. ఈ పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి.

కాదేదీ వ్యర్థం..



మిషన్‌లో కూరగాయల వ్యర్థాలను వేస్తున్న కార్మికుడు

కూరగాయల వ్యర్థాలతో ఎరువు తయారీ

తణుకు మార్కెట్‌లో ప్రాసెసింగ్ యూనిట్

రైతుల నుంచి భారీ డిమాండ్

కూరగాయలు కుళ్లిపోతే పాడేస్తాం.. కానీ కుళ్లిన కూరగాయల వ్యర్థాలు కూడా బంగారమే.. ఎందుకంటే వాటితో ఎరువు తయారు చేసి విక్రయిస్తే ఆదాయానికి ఆదాయం వస్తుంది.. పరిసరాలు కూడా శుభ్రంగా మారతాయి..తణుకులో వ్యర్థాలతో ఎరువు తయారీ ప్రారంభమైంది. మార్కెట్లో వచ్చే కూరగాయలు వ్యర్థాలను పలు రకాలుగా ప్రాసెస్ చేసి ఎరువు తయారు చేస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమానికి తణుకు పట్టణానికి వచ్చినపుడు సంబంధిత యూనిట్‌ను ప్రారంభించారు. తర్వాత కొద్ది రోజులకు పూర్తిస్థాయిలో మిషనరీ బిగించి ఎరువు తయారీ ప్రాసెస్‌ను ప్రారంభించారు.

తణుకు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మార్కెట్లో ప్రతీరోజు కూరగాయల వ్యర్థాలు కుప్పలు, కుప్పలుగా పేరుకు పోతుంటాయి. వాటిని శుభ్రం చేయడం పెద్దపని. అలాంటి వ్యర్థాలను ఉప యోగించి మొక్కలకు, పంటలకు ఉపయోగపడే ఎరువును తయారు చేస్తున్నారు. దీనికోసం మున్సిపాల్టీ ఆధ్వర్యంలో కూరగాయల వ్యర్థాలు కటింగ్ చేసే మిషన్, గ్రీన్ తొట్టిలు మూడు కొనుగోలు చేశారు. వీటి కోసం మార్కెట్ వద్ద షెడ్డు నిర్మించారు. ప్రతి రోజు మార్కెట్‌లో మిగిలిన పనికిరాని కూరగాయల వ్యర్థాలను షెడ్డు వద్దకు చేరుస్తారు. అక్కడ వాటిని మిషన్ కట్టర్ ద్వారా చిన్న చిన్న ముక్కలుగా చేస్తారు. ఈ విధంగా చేసిన ముక్కలను గ్రీన్ బిన్‌లో వేస్తారు. ఇలా ప్రతిరోజు గ్రీన్ బిన్‌లో వ్యర్థాలను లేయర్లుగా వేస్తారు. ఈ ప్రాసెస్‌లో 150 కేజీలు వ్యర్థాలను 75 కేజీలకు తగ్గేవరకు వ్యర్థాలను వేస్తారు. ప్రతి పొరకు బయో క్లోరైడ్ వేస్తారు. ఈవిధంగా 30 రోజులు పాటు చేసిన తర్వాత మరలా కొత్త బిన్‌లో వేస్తారు. ఇదంతా మంచి క్వాలిటీ ఎరువుగా తయారవుతుంది.





ఎరువు తయారీకి ముక్కలు చేసిన కూరగాయలు

సిద్ధం చేసిన వ్యర్థ కూరగాయలు

రిసిట్ ఎంతో మేలు

కూరగాయలు వ్యర్థాలు చిన్న చిన్న ముక్కలు కోసేటపుడు ముక్కలు నుంచి ప్రత్యేకమైన లిక్విడ్ (రిసిట్)వస్తుంది. ఇది కూడా మొక్కలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ద్రవ ఎరు వును ఒక లీటరును పది లీటర్ల నీటిలో కలిపి మొక్కలకు పిచి కారీ చేసుకోవచ్చు. ఇంట్లో కూరగాయలు, పూల మొక్కలు, టెర్రస్ మొక్కలు వంటి వాటికి పిచికారీ చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి.

ఎరువుకు డిమాండ్

ఇప్పటికే ఎరువు కోసం చాలా డిమాండ్ ఉంది. యూనిట్ ప్రారంభం తర్వాత రైతులు చాలా మంది తమకు కావాలని అడుగుతున్నారు. అలాంటి వారికి మున్సిపాల్టీ ప్రాధాన్యతా క్రమంలో అందించే ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం కమిషనర్, మునిసిపాల్టీ, తణుకు పేరుతో చలానా తీయాలని చెబుతున్నారు. కేజీ ఎరువు రూ.15 చొప్పున విక్రయిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

కొత్తగా ట్రక్కు కొనుగోలు



రోజువారీగా మార్కెట్లో పెద్ద మొత్తంలో కూరగాయల వ్యర్థాలు పేరుకుంటాయి. వీటిని వేయడానికి అవసరమైన ట్రక్కు కొనుగోలు చేస్తున్నాం. దీనివల్ల మార్కెట్‌లో వచ్చే వ్యర్థాలను డైరెక్టుగా అందులో వేస్తాం. కూరగాయల నుంచి ఎరువు తయారు చేయడం మంచి పరిణామం. దీనికి అవసమైన సహాయ సహకారాలు అందిస్తాం.

- చినిమిల్లి సాంబశివరావు, కూరగాయల హోల్‌సేల్ మార్కెట్ అధ్యక్షుడు

ఎరువు తయారీ ఎంతో మేలు



కూరగాయల వ్యర్థాలతో ఎరువు తయారు చేయడం రైతులకు ఎంతో మేలు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు మొదటిసారిగా తణుకులో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రాజెక్టును ప్రారంభించారు. దీనిని పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. మార్కెట్‌లో వచ్చే వ్యర్థాల వల్ల తయారయ్యే ఎరువు, ఆయిల్ పంటలకు, పలు రకాల మొక్కలకు ఎంతో మేలు చేస్తాయి.

ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్యే

ఈ ఎరువు ఎంతో నాణ్యమైనది



జిల్లాలో ముందుగా తణుకు మార్కెట్లో ఏర్పాటు చేయడం మంచిన పరిణామం. దీనిని కొనసాగించేందుకు మా వంతు సహకారం ఉంటుంది. ఈ వ్యర్థాల ద్వారా వచ్చే ఎరువు చాలా నాణ్య తగా వస్తుంది. రైతులు ముందుకు వచ్చి కొనుగోలు చేసుకోవాలి.

కాపకాయల ఈశ్వరరావు, సంఘ సభ్యుడు

మీటర్ గిర్రు..గిర్రు

విద్యుత్ ఆదా చేద్దాం !



మండుతున్న ఎండలు

పెరిగిన విద్యుత్ వినియోగం

చిట్కాలతో కరెంటు ఆదా

ఇంధన పరిరక్షణకు విద్యుత్ శాఖ సూచనలు

వేసవి కాలం మండిపోతోంది..ఏసీలు ఫ్యాన్‌లు తిరుగుతూనే ఉంటాయి.. దాంతో పాటు విద్యుత్ మీటర్ కూడా వేగంగానే తిరుగుతుంది.. అంతే కాదు.. విద్యుత్ లోడ్ పెరగడంతో విద్యుత్ అంతరాయాలు పెరుగుతాయి.. ఈ సమయంలో విద్యుత్ ఆదా చేయాల్సిన అవసరం ఉంది.. కొన్ని చిట్కాలు పాటిస్తే విద్యుత్‌ను ఆదా చేయవచ్చు. ఇంధన పరి రక్షణలో చిట్కాలను విద్యుత్ శాఖ విడుదల చేసింది. నేటి సత్సంకల్పం రేపటి వెలుగులకు సాకారం అనే నినాదంతో విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది.

ఏలూరుసిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి)

• లైట్ల వాడకంలో జాగ్రత్తలు

సాధారణ ఫిలమెంట్ బల్బ్ కంటే ఎల్‌ఈడీ బల్బులు తక్కువ కరెంటును తీసుకుంటాయి. 60 వాట్ల ఫిలమెంట్ బల్బు ఇచ్చే వెలుతురును 9 వాట్ల ఎల్‌ఈడీ బల్బు ఇస్తుంది. పగలు వీలైనంత లైట్లు వేయకండి. అలంకరణ లైట్లు, ఎక్కువ వాట్లు ఉన్న లైట్లు విద్యుత్‌ను విపరీతంగా వినియోగిస్తాయి. వాటిని తగ్గించాలి.

• ఇస్త్రీ పెట్టెతో పొదుపు

ఇస్త్రీ పెట్టె కొనేటప్పుడు తక్కువ బరువుండి , ఆటోమేటిక్‌గా పనిచేసే వాటిని ఎంపిక చేసుకోవాలి.కాటన్, ఉన్ని దుస్తులకు మాత్రమే వేడి అవసరం.మిగతా వాటిని తక్కువ వేడితో ఐరన్ చేయవచ్చు. ఇస్త్రీ చేయటం ముగియటానికి 5 నిమిషాలు ముందే స్విచ్ ఆఫ్ చేయాలి.

• ఎలక్ట్రిక్ కుక్కర్

ఎలక్ట్రిక్ కుక్కర్‌తో వంట చేసేటప్పుడు వార్మ్‌లో పడగానే స్విచ్‌ని ఆఫ్ చేసినా ఉడుకుతుంది. ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్‌కు మూత పగిలి పోతే మామూలు ప్లేట్లు వాడుతారు. దీనివల్ల ఆవిరిపోయి కరెంట్ అధికంగా కాలుతుంది.

• ఫ్రిజ్ వాడకంలో..

ఫ్రిజ్ డోర్లు సాధ్యమైనంత తక్కువ సార్లు తెరవాలి. ఒకసారి డోర్ తెరిస్తే అరగంట కూలింగ్ నష్టమవుతుంది. ఫ్రిజ్‌ను వేడి ఉన్న చోట్లో పెట్టడం వల్ల ఎక్కువ కరెంట్ కాలుతుంది. ఫ్రిజ్ వెనుక భాగాన్ని గోడకి తగలకుండా గాలి తగిలేలా ఉంచాలి.

• ఫ్యాన్లు వాడేటప్పుడు

ఇంట్లో అందరు ఓకే చోట కూర్చుంటే రెండు, మూడు ఫ్యాన్లు వేయాల్సిన అవసరం ఉండదు. కిటికీలు, తలుపులకు పల్చటి కర్టెన్లు వేసి తెరిచి ఉంచితే ఫ్యాను అవసరం అంతగా ఉండదు. చాలా ఇళ్ళల్లో లేదా కార్యాలయాల్లో ఫ్యాన్లుకు రెగ్యులేటర్లు పనిచేయక ఫుల్ స్పీడ్‌తో తిరుగుతుంటాయి. దీని వల్ల ఎక్కువ కరెంట్ కాలుతుంది. ఫ్యాన్‌ను ఒకటి లేదా రెండు నంబర్లలో తిరగనిస్తే అందులో సగం కరెంట్ మాత్రమే కాలుతుంది. ఫ్యాన్ తిరిగేటప్పుడు ఎక్కువ శబ్దం వస్తుంటే బేరింగులు దెబ్బతిన్నట్లు గ్రహించాలి. దీనివల్ల మోటార్‌పై లోడ్ పడి ఎక్కువ విద్యుత్ కాలుతుంది.

• ఏసీ..24 కంటే ఎక్కువ ఉండాలి

ఏ/సి వాడుతున్నట్లయితే సెట్టింగును 24 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటె ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎవరూలేని సమయంలో ఏసీని ఆఫ్ చేయండి. బయట నుంచి వేడి రాకుండా కర్టెన్లు , షేడ్స్ సరిగా వేసి ఉంచండి. ఫిల్టర్లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఏ/సి కొంత సేపు పనిచేసాక ఫ్యాన్స్‌తో గదిని చల్లగా ఉంచవచ్చు.

• సోలార్ హీటర్లు బెటర్

గీజర్ కంటె సోలార్ హీటర్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్‌ను ఆదా చేయవచ్చు. మరి వేడి నీటితో కాకుండా గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే కరెండు వినియోగాన్ని తగ్గించవచ్చు. ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చు. వాకింగ్ లేదా వ్యాయామం చేసిన తర్వాత స్నానం చేస్తే వేడి నీటి అవసరం ఉండదు.

• వాషింగ్ మెషిన్


లోడ్‌కు సరిపడా బట్టలు ఉన్నప్పుడే వాషింగ్ మెషిన్‌ను ఉపయోగించాలి. ఇంట్లో వాడే విద్యుత్ పరికరాలన్నీ స్టార్ రేటెడ్ మార్కువి అయితే కరెంట్ వృధా కాదు. 3 లేదా అంతకన్నా ఎక్కువ స్టార్ రేటింగ్ గృహోపకరణాలు వాడకంతో 30 శాతానికి పైగా విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చు.

సహజంగా మనం ఇంట్లో వాడే పరికరాల వల్ల వచ్చే బిల్లులో 30 నుంచి 40 శాతం ఫ్యాన్లు, 15 శాతం ఫ్రిజ్‌లు, 10 నుంచి 20 శాతం లైట్లు మిగతావి టీవీలు, కంప్యూటర్ వంటివి వినియోగించడం వల్ల వస్తుంది. 5 స్టార్ రేటెడ్ గృహోపకరణాలు, ఎల్‌ఈడీ బల్బులు వాడటం వల్ల కరెంట్ బిల్లు చాలా తగ్గటమే కాకుండా కాలుష్యాన్ని కూడా తగ్గించవచ్చు. కరెంట్ లోడ్ ఎక్కువగా ఉండే సమయాల్లో అంటే ఉదయం 5 నుంచి 9, సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు అత్య వసర పనులకు మాత్రమే విద్యుత్‌ను వినియోగించండి. దీనివల్ల నాణ్యమైన విద్యుత్ అందరికీ అందు తుంది.

మీకు తెలుసా !

టీవీ చూసిన తరువాత కొందరు రిమోట్ ద్వారా ఆఫ్ చేస్తారు. దీనివల్ల కూడా కొంత కరెంటు వృధా అవుతుంది. రిమోట్ కాకుండా టీవీ స్విచ్‌ని ఆపండి. మొబైల్ ఫోన్ ఛార్జింగ్ పూర్తయిన తరువాత ప్లగ్ తీసివేయటం గాని స్విచ్ ఆఫ్ తప్పక చేయాలి. కంప్యూటర్లు ఉంటే పని పూర్తయిన తర్వాత వాటిని స్లీప్ మోడ్‌లో లేదా ఆఫ్ చేసి పెట్టండి.

పోలవరం ప్రాజెక్టులో మట్టి, రాతి నాణ్యతా సామర్థ్య పరీక్షలు



రింగు టెస్టు నిర్వహిస్తున్న నిపుణుల బృందం

పోలవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గ్యాప్1, గ్యాప్ 2, ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం నిర్మాణానికి అవసరమయ్యే రాతి, కాంక్రీట్ నాణ్యతా ప్రమాణాలను కేంద్ర మట్టి రాతి నాణ్యతా పరిశీలన(సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ సెంటర్)కు చెందిన రెండు నిపుణుల బృందాలు మంగళవారం పరిశీ లించాయి. బట్రస్ డ్యాం నిర్మాణాన్ని, 902 హిల్ ప్రాంతం, ఎర్త్‌కం రాక్ ఫిల్ డ్యాం ప్రాంతం, డయా ఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతాలు ఇతర ప్రాంతాలను కేంద్ర నిపుణుల బృందం పరిశీలించింది. ప్రాజెక్టు నిర్మాణంలో వినియోగించే కాంక్రీట్, అందులో కలిపే మెటీరియల్స్‌ను నిపుణులు రవి అగర్వాల్ పరిశీలించగా రాతి నాణ్యతను లలిత్ కుమార్ సోలంకి, సందీప్ దనోటే పరిశీలించారు. 902 హిల్ ప్రాంతంలో వివిధ ప్రాంతాల్లో రాతి నమూనాలను ఒక బృందం సేకరించగా, మరో బృందం క్వాలిటీ కంట్రోల్ కార్యాలయంలో కాంక్రీటు కలిపి గట్టిపడిన దిమ్మల నాణ్యత, సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. పరిశీలన అనంతరం బృందం సేకరించిన నమూనాలను ఢిల్లీ తీసుకెళ్లి అక్కడ నాణ్యతా ప్రమాణాలు పరిశీలించిన అనంతరం కేంద్రానికి నివేదిక ఇవ్వనుంది.బృందం వెంట జలవనరుల శాఖ అధికారులు డి.శ్రీనివాస్, ఎం.శ్రీరాం, ఆర్.దుర్గా ప్రసాద్, చిరంజీవి, వి.జగదీశ్, జి.సురేంద్ర, జాన్ కరణ్, మెగా కంపెనీ జీఎం గంగాధర్, డీజీఎం మురళీ ఉన్నారు.



నరసింహుని ఆలయానికి 30 ఎకరాల భూమి

జీవో జారీ చేసిన ప్రభుత్వం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సుందరగిరిపై కొలువైన లక్ష్మీనరసింహుని ఆలయ అభివృద్ధి కోసం 30 ఎకరాల ప్రభుత్వ భూమిని దేవదాయ శాఖకు కేటాయించేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి మంగళవారం జీవో జారీ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో ఈనెల 15న జరిగిన క్యాబినెట్ సమా వేశంలో పలు అంశాలపై ఆలయ అభివృద్ధికి భూ ప్రతిపాదన చేసి ఆమోదించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి మంగళ వారం భూమిని ఆలయ అభివృద్ధికి కేటా యిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఉత్తర్వుల ప్రకారం ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాధపురంలో కొలువైన లక్ష్మీనరసింహా స్వామి ఆలయ అభివృద్ధి కోసం ఆర్ఎస్ నెం 425/ 193లో 30 ఎకరాల భూమిని ఇవ్వాలని జిల్లా కలెక్టర్ చేసిన ప్రతిపాద నను మార్చి 27న జరిగిన సమావేశంలో ప్రతిపాదించామని భూపరిపాలన ప్రత్యేక కమిషనర్, ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్త ర్వులో పేర్కొన్నారు. మంత్రివర్గం ఆమో దించిన వారానికే జీవో జారీ చేయ డంతో పలువురు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆలయం మరింత అభివృద్ధి అవుతుందని భక్తులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ముస్తాబైన కల్యాణ మండపం

నేడు లక్ష్మీపురం శ్రీనివాసుని కల్యాణం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఇందులో బాగంగా మంగళవారం ఉదయం ఆలయ యాగశాలలో పండితులు హోమాలను జరిపారు. ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకారాలు చేసి హారతులిచ్చారు. బుధవారం రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం ప్రారంభమవుతుందని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలు, పుష్పమాలికలు, మామిడి తోరణాలతో సుందరీకరించారు.కల్యాణ మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు.



బుట్టాయగూడెం మండలంలో జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

బుట్టాయగూడెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుట్టాయగూడెం మండలంలో మంగళవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.65 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయినేజి పనులను ప్రారంభించారు. రెడ్డిగణపవరం పంచాయతీ పల్లపూరు నిర్వాసిత కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 35 వేల మంది నిర్వాసితులను బయట ప్రాంతాలకు తరలించడం జరిగిందన్నారు. నిర్వాసితులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని, భూమిని ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన పేదలకు త్వరలో కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. ఏజెన్సీలో రోడ్లు, డ్రెయిన్లు మరమ్మతులకు, నిర్మాణాలకు రూ.27 కోట్లు ఇవ్వడం జరిగిందని మరో రూ.20 కోట్లు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ సుముఖంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వం సత్యసాయి మంచినీటి పథకాన్ని నిర్వీర్యం చేసిందని, కనీసం కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేదని, పథకం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్టీ నిర్వాసితులకు అంత్యోదయ అన్న యోజన కార్డులను ఇచ్చి నెలకు 35 కేజీల బియ్యాన్ని ఉచితంగా ఇస్తామన్నారు. ముందుగా 798 మందికి కార్డులు మంజూరుచేసి బియ్యాన్ని ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. నిర్వాసితుల కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. పీ4తో పేదల జీవితాల్లో మార్పులు వస్తాయని అందుకు అందరూ సహకరించాలని సూచించారు. చిన్న పరిశ్రమలు స్థాపనతో ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో మన జిల్లా అభివృద్ధి అంశాల్లో 5వ స్థానంలో ఉందని మూడో స్థానం కోసం కృషి చేయాలని తెలిపారు. నిర్వాసితులు కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవని, ఉపాధి లేదని, శ్మశాన వాటిక లేదని, పూర్తిస్థాయి పరిహారం అందించాలని అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మంత్రిని తెలపగా చర్యలు తీసుకుంటామన్నారు.

● జీలుగుమిల్లి: మండలంలో రౌతుగూడెం, ఎర్రవరం నిర్వాసిత కాలనీల్లో గిరిజనుల సమస్యల్ని మంత్రి నాదెండ్ల మనోహర్ అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో రాములు నాయక్‌ను ఆదేశించారు. నిర్వాసితుల ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి జనసేనలోకి అంకన్నగూడెం, తాటియాకులగూడెం, జీలుగుమిల్లికి చెందిన పలువురు పార్టీలో చేశారు. కటుకూరు నిర్వాసిత కాలనీలో వేలేరుపాడు మండల వాసులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో కలసి మంత్రికి శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో పౌర సరఫరాలశాఖ కమిషనర్ సౌరవ్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఆర్డీవో రమణ, ఐటీడీఏ పీవో రాములు నాయక్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, జనసే పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, ఘంటా మురళి, గడ్డమణుగు రవికుమార్, కరాటం సాయి, పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, ములిశెట్టి యుగంధర్, తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్, సీఐ ఎస్సైలు వెంకటేశ్వరావు, నవీన్‌కుమార్, మేకా ఈశ్వరయ్య, కరాటం సాయిబాబా, కరాటం ఉమామహేశ్వరరావు, అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.



క్రీడాభిమానులకు క్రికెట్ ఒక పండగ. వన్డే.. టెస్ట్ మ్యాచ్.. టీ20 ఫార్మాట్ ఏదైనా మ్యాచ్ జరిగితే మైదానం హోరెత్తిపోతుంది. దేశవ్యాప్తంగా టీవీలు, సెల్‌ఫోన్లు మోతెక్కిపోతాయి. మరోవైపు జాదం కమ్మేస్తుంది. కాసుల గలగల ఏమాత్రం వినిపించకుండా బెట్టింగ్ భూతం కుమ్మేస్తుంది. వేసవి ఎండకు మించి ఐపీఎల్ వేడి యువతకు సెగలు పుట్టిస్తోంది. బెట్టింగ్ యాప్‌లలో పందేలు కాసి జేబులు, వళ్లు గుల్ల చేసుకుంటున్నారు. జిల్లాలో సుమారు రోజుకు రూ.10 కోట్లు పైనే యాప్‌ల ద్వారా పందేలు కాస్తున్నట్లు అనధికారిక అంచనా. ఒకసారి సొమ్ము పొందినా.. పోగొట్టుకున్నా మరింతగా బెట్టింగ్ మాయలో పడి అప్పుల పాలవుతున్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

తాడేపల్లిగూడెంలోని ఓ చిరుద్యోగి సరదాగా ఫేస్‌బుక్ రీల్స్ చూస్తున్నాడు. మధ్యలో ఐపీఎల్‌లో లక్షలు సంపాదించే మార్గం చెబుతా నా ఛానల్‌లో చేరండి.. మీ డబ్బులకు నాది గ్యారంటీ.. ఓ వ్యక్తి తన ఛానల్ ప్రమోషన్‌లో చెప్పడం ఆకర్షించింది. ఒకసారి చూద్దామని అతగాడు పెట్టిన లింక్ క్లిక్ చేశాడు. వెంటనే బుకీ ఏర్పాటుచేసిన ఛానల్‌కు వెళ్లిపోయాడు. నాలుగు రోజులు ఆ ఛానల్ పరిశీలించి బాగానే గెలిచే జట్లను చెబుతున్నాడని ఫాలో అయ్యాడు. పది రోజులు సొమ్ములు బాగానే వచ్చాయి. అప్పటి వరకూ వందల్లో కాసిన పందేలు వేలల్లోకి చేరుకుంది. ఐదు రోజులకు రూ.2 లక్షలు పోగొట్టుకుని అప్పులపాలయ్యాడు. అప్పుల వాళ్లు వెంటబడడంతో భార్య తాళి తాకట్టుపెట్టాడు.

జిల్లాలో ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి సరదాగా తోటి స్నేహితులతో ఓ రెస్టారెంట్‌కు వెళ్లాడు. అక్కడ తోటి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ అక్కడ టీవీ స్క్రీన్‌పై ఐపీఎల్ చూస్తూ సరదాగా స్నేహితులతో మా కోహ్లి ఈ రోజు సెంచరీ చేస్తాడని అరిచాడు. మరొకడు బెట్ ఎంతరా అన్నాడు. ఇద్దరూ పందెం కాసుకున్నారు. అలా మొదలైన బెట్టింగ్ ఆనక ఆ విద్యార్థి తన పాకెట్ మనీ పోగొట్టుకోగా స్నేహితుల దగ్గర అప్పులు చేసి మరీ పందేలు కట్టాడు. చివరికి అప్పులు తీర్చడానికి కాలేజి మానేసి బయట పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

బెట్టింగ్ భూతం



- సొమ్ము పోగొట్టుకుంటున్న యువత
- అర చేతిలో బెట్టింగ్ యాప్‌లు
- ఐపీఎల్‌కు ఊతమిస్తున్న దాబాలు
- క్షణాల్లో చేతులు మారుతున్న లక్షలు

భీమవరం క్రైం/తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ భూతం భయపెడుతోంది. సాధారణంగా పందేలు కాసే నైజం ఉన్న గోదారి కుర్రోళ్లను ఐపీఎల్ పట్టిపీడిస్తోంది. క్షణానికో లక్ష చేతులు మారేంతగా బెట్టింగ్ విస్తృతమవుతోంది. లక్షలను పైసల్లో లెక్కేస్తూ బెట్టింగ్ ప్రక్రియ సాగుతోంది. టాస్ నుంచి ఆఖరి బాల్ వరకూ బంతి బంతికీ పందేలు, జట్ల జయాపజయాలు, అధిక స్కోర్లపై బెట్టింగ్ జరుగుతోంది. అదే పనిగా యువత బెట్టింగ్‌తో జేబు గుల్ల చేసుకుంటున్నారు. దీంతో సామాన్య మధ్య తరగతి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

కొన్ని రోజులుగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఐపీఎల్ (20-20) మ్యాచ్‌లతో యువత ఎక్కువగా టీవీలకు అతుక్కుపోయి బెట్టింగ్ కాస్తున్నారు. భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు తదితర పట్టణాల్లో బెట్టింగ్ జోరు కొనసాగుతున్నట్లు సమాచారం. సాయంత్రమైతే టీవీల వద్ద కూర్చుని బెట్టింగ్‌లో మునిగి తేలుతున్నారు. యువత స్మార్ట్ ఫోన్‌లో పలు బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని పందేలు కాస్తున్నారు. యాప్‌లలో పందేలు వచ్చిన సొమ్ము అలాగే ఉంచి రెండో రోజు పందెం వేసే వెసులుబాటుతో యువత చిక్కుకుపోతున్నారు. అధిక వడ్డీలకు అప్పు చేసి మరీ పందేలు కాయడం సర్వసాధారణంగా మారింది.

బెట్టింగ్ రకరకాలు!

క్రికెట్ బెట్టింగ్‌లలో పలు రకాలుగా నిర్వహిస్తుంటారు. మ్యాచ్ మొదట బ్యాటింగ్ తీసుకున్న టీమ్‌ను ప్లేయింగ్ అని, రెండో బ్యాటింగ్ తీసుకున్న టీమ్‌ను ఈటింగ్ అని ఉదహరిస్తారు. సమానంగా పందెం కాసేటప్పుడు బోర్డు 90గా ఉదహరిస్తారు. బోర్డు 60, బోర్డు 70 అంటే పందెం కాసిన టీమ్ గెలిస్తే రూ.700, ఓడిపోతే రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. ఓవర్‌కు ఇన్ని పరుగులు కొడతారంటూ కాసే పందేన్ని ఫ్యాన్సీ పందేలుగా ఉదహరిస్తారు. ఆటలో మొదటి ఆరు ఓవర్లకు, 10 ఓవర్లకు, 20 ఓవర్లకు ఎన్ని పరుగులు సాధిస్తారనే పందెం కూడా వేస్తారు.

వందల్లో యాప్‌లు

బెట్టింగ్ యాప్‌లతో పందేల జోరు పెరిగింది. రకరకాల యాప్‌లు వందల్లో స్మార్ట్ ఫోన్లలో అందుబాటులోకి రావడంతో వాటిని అనుసరిస్తున్నారు. ఏ యాప్‌లో పందెం కాస్తే బాగుంటుందన్న అంశాన్ని కూడా పరిశీలించి మరీ పందేలు కాయడం సర్వసాధారణమైంది. పందేలు కాసే ముందు వారి ఖాతాలో సరిపడినంత సొమ్మును ముందుగా జమ చేయాలి. సొమ్ము ఖాళీ అయితే మళ్లీ జమ చేయాల్సిందే. పందెం గెలిస్తే సంబంధిత ఖాతాలో జమ అవుతాయి. యాప్‌లతో బెట్టింగ్ సులభతరం కావడంతో పందేలు జోరుగా సాగుతున్నాయి.

బెట్టింగ్ అడ్డా.. దాబా..

బార్లు, రెస్టారెంట్‌లకు తోడు తాజాగా దాబాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ఐపీఎల్ మ్యాచ్ మందుబాబులకు జోష్ నింపుతోంది. దాబాల్లో మందేసి చిందేసి అక్కడే బెట్టింగ్ కాసి ఎంజాయ్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లోనే కాదు స్నేహితులతో కూడా పందేలు కడుతున్నారు. దాబాల్లో పోలీసు నియంత్రణ కొరవడిందని ఆరోపణలు ఉన్నాయి.

ప్రత్యేక దృష్టి పెట్టాం



బెట్టింగ్‌లు యాప్‌ల ద్వారా పందేలు కాసే వారిపై దృష్టి పెట్టాం. కొంత మందిని అరెస్ట్ చేశాం. యాప్‌లు అందుబాటులోకి రావడంతో స్మార్ట్ ఫోన్లు పందేలకు కీలకంగా మారాయి. యువత చెడు దారుల్లో పడకుండా చూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది. చాలా మంది బెట్టింగ్‌లో సొమ్ము పోగొట్టుకుని రోడ్డునపడ్డవారు ఉన్నారు. అలాంటి వారిని చూసి మారితే బాగుంటుంది.

– ఆర్‌జీ.జయసూర్య, డీఎస్పీ, భీమవరం

బెట్టింగ్‌పై నిఘా



ఎక్కడ బెట్టింగ్‌లు జరుగుతుందనే సమాచారంతో నిఘా ఉంచుతున్నాం. బెట్టింగ్ నిర్వహణ యాప్‌లను ప్రభుత్వం బ్యాన్ చేసింది. పోలీసు సిబ్బంది కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైనా పందేల జోలికి వెళితే నష్టంతోపాటు కుటుంబాలు రోడ్డున పడతాయి. ఎక్కడైనా దాబాల్లో స్క్రీన్‌లు వేసి పందాల నిర్వహణ చేస్తున్నారనే దానిపై దృష్టి సారించాం. వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకుంటాం.

– ఎ.సుబ్రహ్మణ్యం, సీఐ, తాడేపల్లిగూడెం

జగన్ పత్రిక అసత్య కథనం

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆగ్రహం



సంజాయిషీ కోరుతున్న చింతమనేని ప్రభాకర్

ఏలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జగన్ పత్రిక అసత్య కథనంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చింతమనేని బాధితుల రక్తతర్పణం' అంటూ ప్రచురించిన కథనంపై ఏలూరులో జగన్ పత్రిక కార్యాలయం వద్ద కూటమి నాయకులతో కలిసి చింతమనేని ప్రభాకర్ మంగళవారం నిరసన తెలిపారు. గత వైసీపీ ఎమ్మెల్యేల మాదిరిగా తాను అవినీతికి పాల్పడలేదన్నారు. మీడియాలో, పత్రికలో తనకు సంబంధం ఉందని నిరూపిస్తే స్పీకర్ ఫార్మేట్‌లో రాజీనామా స్పీకర్ అయ్యన్న పాత్రుడికి అందిస్తానని చింతమనేని సవాల్ విసిరారు. చౌకబారు విమర్శలు, ఆరోపణలు మాని ప్రజలకు మంచి చేసేందుకు పనిచేయాలని హితవు పలికారు. ఆందోళనలో ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వివాదానికి రాజకీయ రంగు

ఏలూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మేనమామ, మేనల్లుడు మధ్య మట్టి తవ్వకాల అంశం దెందులూరులో వివాదానికి ఆజ్యం పోసింది. రాజకీయ రంగు పులిమి వైసీపీ నాయకులు తమకు అనుకూలంగా మార్చుకోవాలన్న ప్రయత్నం బెడిసికొట్టింది. చల్లచింతలపూడి మట్టి వివాదంలో బాబూరావు మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం చర్చనీయాంశమైంది. చల్లచింతలపూడి శివారు కొత్త కమ్మవారి గూడెంకు చెందిన పుసులూరి బోసు మేనమామ(విజయవాడ) దాసరి బాబూరావుకు చెందిన 9.5 ఎకరాల భూమిని 2021లో జీఆర్‌ఐఎల్‌ఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(నేషనల్ హైవే)కి రెండేళ్ల గ్రావెల్ తవ్వకుని తీసుకునేలా లీజుకు ఇచ్చారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. టీడీపీకి బలమైన నేత పుసులూరి బోసును వైసీపీలోకి రాకపోతే క్వారీని అడ్డుకుంటామని హెచ్చరించారు. బోసు నిరాకరించడంతో వైసీపీ నేతలు క్వారీ తవ్వకాలను అడ్డుకున్నారు. అనంతరం ప్రభుత్వం మారడంతో 2024 ఆగస్టులో పుసులూరి బోసు రూ.90 లక్షలు చెల్లించి గ్రావెల్ తవ్వకునేందుకు బాబూరావు పేరిట మైనింగ్ శాఖ ద్వారా అనుమతి తీసుకునేలా ఇద్దరూ పెద్దల సమక్షంలో అంగీకారం కుదుర్చుకున్నారు. రూ.90 లక్షలు తీసుకున్న బాబూరావు మైనింగ్ శాఖ కార్యాలయానికి రాకుండా కాలయాపన చేయడంతో వారి మధ్య వివాదం ముదిరింది. ఎమ్మెల్యే చింతమనేని వద్దకు వెళ్లడంతో కుటుంబ సమస్య అయినందున పెద్దల సమక్షంలో మాట్లాడుకోవాలని సూచించారు. పెద్దల మధ్య వారి సమస్య పరిష్కారం కాలేదు. రూ.90 లక్షలు చెల్లించి నీ భూమి తీసుకోవాలని లేదా? మైనింగ్ అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ నెల 20న బోసు క్వారీ వద్ద మిషన్లు రావడంతో మంగళగిరి పార్టీ కార్యాలయం వద్ద బాబూరావు ఆత్మహత్యాయత్నం చేసుకోవడం వివాదాస్పదమైంది. వివాదంపై బోసు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తనను ఇబ్బంది పెట్టడం సరికాదని, తాను చెల్లించిన మొత్తం తిరిగి ఇస్తే మంచిదన్నాడు. కుటుంబ విషయం కాబట్టి చింతమనేని ప్రభాకర్ తటస్థంగా ఉన్నా ఆయనను వివాదంలో లాగడంతో చింతమనేని దీనిని సమర్థవంతంగా తిప్పికొట్టారు.

పేదలపై విధ్వంసకాండ దారుణం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



తొలగించిన గృహాలను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పాలకోడేరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు అల్లూరి సీతారామ రాజు నగర్‌లో పేదల ఇళ్లు తొలగించడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఇళ్లు తొలగించిన ప్రాంతంలో మంగళవారం పర్యటించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పడగొట్టిన పేదల ఇల్లు పక్కనే ఆనుకుని ఉన్న భూస్వాములు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని, ప్రభుత్వ సర్వే రాళ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పేదలు, ఒంటరి మహిళలు, వృద్ధులు, బాలింతలపై ప్రభుత్వ విధ్వంసం, అరాచకాన్ని సృష్టించిందన్నారు. చంద్రబాబు పుట్టినరోజు నాడు జరిగిన ఈ ఘటనను ముఖ్యమంత్రి బహుమతిగా స్వీకరిస్తారా, తిరస్కరిస్తారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు చేసిన పాపంలో కలెక్టర్ నుంచి ఎమ్మార్వో వరకు అధికారులందరూ భాగస్తులే అన్నారు. ప్రభుత్వ భూముల్లో పేదలు ఇల్లు వేసుకుంటే తొలగించే అధికారం ఎవరికీ లేదన్నారు. మహిళలను మగ పోలీసులు కొట్టడంపై మానవ హక్కుల సంఘాలకు నివేదిస్తామన్నారు. ప్రజల పక్షాన ఉండాల్సిన అధికారులు, ఎమ్మెల్యేకు డూడూ బసవన్నలా మారారన్నారు. డబ్బులిచ్చి ఓట్లేయించుకున్నాను అని ఎమ్మెల్యే చెప్పడం సిగ్గుచేటన్నారు. డిప్యూటీ స్పీకర్ పదవికి రఘురామకృష్ణంరాజు అనర్హుడన్నారు. ప్రభుత్వానికి దమ్ముంటే రఘురామకృష్ణంరాజు అవినీతిని, ఎగ్గొట్టిన బకాయిలను బయటపెట్టాలన్నారు. ఉండి నియోజకవర్గంలో ఇంత విధ్వంసం జరుగుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కనబడడం లేదా అని శ్రీనివాసరావు ప్రశ్నించారు. పేదల ఇళ్లను కూల్చాలని చూస్తే చూస్తూ ఉండబోమని, ఎర్రజెండా అండగా నిలుస్తుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో ఆరు నెలల కాలంలో వందలాది పేదల ఇళ్లు తొలగించారని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బలరాం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 ఉండి నియోజకవర్గంలో రివర్స్‌లో అమలవుతుందన్నారు. ఇక్కడ పేదలను కొట్టి సంపన్నులకు ఆస్తులను కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం నేతలు మంతెన సీతారాం, బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, దూసి కళ్యాణి, మామిడిశెట్టి రామాంజనేయులు, కె.క్రాంతిబాబు, ధనికొండ శ్రీనివాస్, కె.తవిటినాయుడు, జుత్తిగ నరసింహమూర్తి, శేషపు అక్రియ్య తదితరులు పాల్గొన్నారు.

కాల్వలోకి దూసుకుపోయిన కారు

ఒకరి మృతి



కాల్వలో కారు మృతుడు నాగరాజు (ఫైల్)

బుట్టాయగూడెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కామయ్యకుంట-రవ్వారిగూడెం మధ్య కొండకాలువ కల్వర్టు వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో బూరుగువాడకు చెందిన కుంజా నాగరాజు(40) మృతి చెందారు. పులిరాముడుగూడెం నుంచి కేఆర్.పురం వెళుతుండగా రవ్వారిగూడెం సమీపంలో కొండకాల్వ కల్వర్టును దాటే సమయంలో అదుపుతప్పిన కారు కాల్వలోకి దూసుకుపోయింది. స్టీరింగ్ బలంగా గుండెకు తగలడం వలన నాగరాజు మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. నాగరాజు వచ్చే నెలలో వివాహం కావల్సి ఉన్నట్లు తెలిసింది. ఇంతలోనే మృత్యువు కారు రూపంలో కబళించిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై దుర్గా మహేశ్వరావు మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని..

పెదవేగి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రహదారిపై నడిచివెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. అంకన్నగూడెం గ్రామానికి చెందిన పరసా సాయికిరణ్ రహదారిపై నడిచి వెళుతుండగా వెనుక నుంచి ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సాయికిరణ్‌ను వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వీఆర్వో జంగం పూర్ణచంద్రరావు ఫిర్యాదు ఆధారంగా కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు



ఏలూరు క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళుతున్న దంపతులను కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఉంగుటూరు మండలం కురెళ్లగూడెం గ్రామానికి చెందిన దంపతులు ఏలూరు నుంచి మోటారు సైకిల్‌పై మంగళవారం వెళ్తుండగా ఏలూరు గూడ్స్‌షెడ్డు వద్ద ఒక మహిళ నడుపుతున్న కారు అతి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన దంపతులను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

కాలిన గాయాలతో వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం/పెదవేగి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాలిన గాయాలతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పి పాపమ్మ (80) ఈనెల 13న ఉదయం పొయ్యిపై టీ కాస్తుండగా చీరకు నిప్పంటుకుని అగ్ని ప్రమాదం సంభవించింది. తీవ్ర గాయాలైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేసి ఔట్‌పోస్టుపోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ చెప్పారు.

ఆటో కనిపిస్తే మాయం చేస్తాడు

ఏడు ఆటోలతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

తాడేపల్లిగూడెం రూరల్ ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆటో పార్క్‌చేసి ఉందంటే తెల్లారేసరికి మాయం చేస్తున్న మాయగాడిని తాడేపల్లిగూడెం పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద రూ.14లక్షల విలువ చేసే 7 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ ఎం విశ్వనాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంలో ఆటోల అపహరణ కేసులు నమోదవుతుండడంతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. తాడేపల్లిగూడెం మామిడితోటకు చెందిన ములగాల వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు అపహరించిన ఏడు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. ఆటోల చోరీ కేసులో కీలకంగా వ్యవహరించిన సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సైలు బాదం శ్రీను, పి నాగరాజు, సిబ్బందిని డీఎస్పీ విశ్వనాథ్ అభినందించారు.

పెరవలి - మార్టేరు రోడ్డు మూసివేత

25 నుంచి జూన్ 25 వరకు రాకపోకలు మళ్లింపు

రహదారి, పెనుగొండ వంతెన మరమ్మతు పనులు

పెనుమంట్ర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పెరవలి- మార్టేరు మార్గంలో నెగ్గిపూడి నుంచి పెనుగొండ వరకు ఆర్ అండ్ బి రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈనెల 25 నుంచి జూన్ 25 వరకు 45 రోజులు పాటు ఈ మార్గంలో రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఆర్ అండ్ బి ఏఈ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనుమంట్ర మండలం నెగ్గిపూడి పరిధిలో రహదారి నిర్మాణం, పెనుగొండలో వంతెన మరమ్మతు పనులు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. మార్టేరు-రావులపాలెం వాహనాలను మార్టేరు, ఆచంట, సిద్ధాంతం మీదుగా మళ్లించడం జరుగుతుందన్నారు. మార్టేరు నుంచి తణుకు వెళ్లే వాహనాలను మార్టేరు, ఆలమూరు, ఇరగవరం మీదుగా మళ్లించినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

జిల్లాలో జడ్జిలు బదిలీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ కోర్టులలో జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీలు చేస్తూ హైకోర్టు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మే 2లోపు నూతన పోస్టింగ్‌లలో బాధ్యతలు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జడ్జి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్.రాజ్యలక్ష్మి	హిందుపూర్	నరసాపురం
ఎన్.మేరీ	మచిలీపట్నం	ఏలూరు
పర్వేజొషేక్	మొబైల్ కోర్టు	సివిల్ జడ్జి, ఏలూరు
కె.శ్రావణి	జగ్గయ్యపేట	నూజివీడు
ఎం.శివపార్వతి	నూజివీడు	సివిల్ జడ్జి, నూజివీడు
వి.వెంకటేశ్వరరావు	నూజివీడు	ఒంగోలు
ఎన్.జ్యోతి	విజయవాడ	భీమవరం
ఓ.అనూష	వెంకటగిరి	నూజివీడు
ఎస్.ప్రియదర్శిని	అద్దంకి	భీమడోలు
కె.లలితాదేవి	విశాఖపట్టణం	తాడేపల్లిగూడెం
బి.ధనరాజు	భీమవరం	గుంటూరు
జేటీటీఎస్.దేవి	కొవ్వూరు	మచిలీపట్టణం
కంచి శ్రీనివాస్	నర్సాపురం	సోంపేట
డి.అరుంధతి	తాడేపల్లిగూడెం	గుడివాడ
ఎ.వెంకట నాగరాజు	తణుకు	సత్యవీడు
ఆదిత్య రిషిక్	భీమడోలు	విజయవాడ
కె.కృష్ణవేణి	తాడిపత్రి	తణుకు



మహిళను బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

రైలు పట్టాలపై మహిళ

కాపాడిన రైల్వే, ఆర్‌పీఎఫ్ పోలీసులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మతి స్థిమితం సరిగాలేక అర్ధరాత్రి రైలు పట్టాలపై నిలబడి ఉన్న మహిళను రాత్రి గస్తీ పోలీసులు గమనించారు. ఆమెను కాపాడి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు. ఏలూరు వెన్నవల్లివారి పేట సమీపంలోని ఏసుపాదపురానికి చెందిన గూడపాటి లలితా కుమారి (46) సోమవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో ఏలూరు రైల్వేస్టేషన్‌లో విజయవాడ వైపు వెళ్లే రైలుపట్టాలపై నిలబడి ఉంది. రాత్రి గస్తీ పోలీస్ సిబ్బంది, రైల్వే హోమ్‌గార్డు కుమార్, ఆర్‌పీఎఫ్ మహిళా కానిస్టేబుల్ ఆమెను గమనించి వెంటనే రక్షించారు. ఆమెకు కొద్ది రోజుల నుంచి మతి స్థిమితం సరిగాలేదని గుర్తించారు. ఆ మహిళ తమ్ముడు సోమరాజుకు సమాచారం ఇచ్చి అప్పగించినట్లుగా రైల్వే ఎస్‌ఐ పి సైమన్ తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు : ఎంపీడీవో

నిడమర్రు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఈ వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పనిచేయాలని ఎంపీడీవో విజయ కుమారి సూచించారు. మంగళవారం నిడమర్రు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, రూరల్ వాటర్ వర్క్స్ డిపార్టుమెంట్ వారితో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో వివిధ గ్రామాల్లో అందుబాటులోని తాగు నీటివనరుల గురించి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ స్వామి పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై విద్యార్థులకు అవగాహన

చింతలపూడి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు రోజుల పాటు అంతర్జాతీయ కార్యశాల కార్యక్రమంలో భాగంగా ఆంగ్లభాషపై అవగాహన కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రధానంగా ఆంగ్లభాషపై పట్టుకోసం అవగాహన కల్పించడానికి అమెరికా వివిధ రాష్ట్రాలకు చెందిన రిసోర్స్ పర్సన్లతో విద్యార్థులకు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు కోసమే ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఆత్మస్థైర్యంతో అంగవైకల్యాన్ని అధిగమించండి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ఆత్మస్థైర్యంతో అంగవైకల్యాన్ని అధిగమించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినికిడి యంత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రతీ రోజు క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బారు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో వినికిడిలోపం ఉన్నవారు వారి నుంచి అర్జీలు వచ్చాయన్నారు. వెంటనే వినికిడిలోపం యంత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిజేబుల్డ్ వెల్ఫేర్ ఏడీ రామ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు గట్లు పటిష్టం చేస్తున్నాం

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు తాగు నీరందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు చెరువుగట్టు పటిష్ట పరిచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును ఎమ్మెల్యే చంటి, మేయర్ షేక్ నూర్జహాన్‌లు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి వాటర్ లీకేజీను నిలుపుదల చేయగలిగామన్నారు. రెండు, మూడు రోజుల్లో చెరువు గట్లు పటిష్టపరిచే పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, మున్సిపల్ కమి షనర్ భానుప్రతాప్, ఎంతః సురేంద్రబాబు, డీఈలు నారాయణరావు, రజాక్, ఏఈలు సాంబశివరావు, సాయి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పాల్గొన్నారు.

ఆదివాసీలపై దాడులు ఆపి శాంతి చర్చలు జరపాలి

టి.నర్సాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మధ్యభారత అడవుల్లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ఆపి ప్రభుత్వం వారితో శాంతిచర్చలు జరపాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలోని మర్రిగూడెంలో లెనిన్ జయంతిని మంగళవారం నిర్వహించి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యభారత అడవుల్లో కొనసాగుతున్న ఖగార్ దాడికి వ్యతిరేకంగా అన్ని ప్రజా సంఘాలు కలిసి తెలుగు రాష్ట్రాల్లో శాంతి ర్యాలీ ప్రదర్శనలు, సభలు నిర్వహిస్తున్నారన్నారు. దాడులను ఆపి శాంతిని నెలకొల్పే దిశగా ప్రభుత్వాలు చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి బాబూరావు, మండల నాయకులు కాటయ్య, నాగేశ్వరరావు, అర్జున్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయి వేతనాలు విడుదల చేయాలి

టి.నర్సాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో జి.మణికుమారికి అందజేశారు. ఉపాధి బకాయిలు చెల్లించకపోగా మండలంలోని రామమ్మగూడెం, సాలిగూడెం, అప్పలరాజు గూడెం, ప్రకాశ్ నగర్, గ్రామాల్లో పేదలు ఉపిధి పని కోరుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మడకం కుమారి, శిరీష, బేబి, దుర్గమ్మ, పులి కృష్ణమ్మ, ముత్యాలమ్మ, గీతా, వేమన చెల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతి, యువకులకు స్వయం ఉపాధి శిక్షణ కోర్సు అందిస్తున్నట్టు ఎస్సీ సొసైటీ ఈడీ ఎం.ముక్కంటి తెలిపారు. పీఎంఏజేఎంఐ స్కీమ్ కింద నేషనల్ అకాడమి ఆఫ్ కనస్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో స్కిల్డ్ ట్రైనింగ్ ప్రోగ్రాంను జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ యువతకు ఏర్పాటు చేశామన్నారు.టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. జంగారెడ్డిగూడెం ఎస్సీ బాయ్స్ హాస్టల్లో శిక్షణ ఇస్తామన్నారు. రెండు నెలల శిక్షణ కాలంలో ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు(93812 73099, 94940 97819) నెంబర్లలో సంప్రదించాలన్నారు.

క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు జయప్రదం చేయండి

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : మేడే కార్మిక దినోత్సవం సందర్భంగా జగరంలో 26న జరిగే క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా నాయకులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, పళ్లెం కిశోర్‌లు తెలిపారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో మేడే ఉత్సవాల నిర్వహణకు సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 26న సీపీఐ కార్యాలయంలో చెస్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బండి వెంకటేశ్వరరావు, భజంత్రీ శ్రీనివాసరావు, బి.జగన్నాథరావు, యర్రా వెంకటేశ్వర్లు, కె.జగన్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఏలూరులో వసతి గృహాలు

ఏలూరు రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శారీరక వైకల్యం, దృష్టిలోపం బధిర విద్యార్థులకు 3వ తరగతి నుంచి పీజీ స్థాయి వరకు చదువుతున్న వారికి కోటదిబ్బ ప్రాంతంలో బాలబాలికలకు వేర్వేరుగా ప్రత్యేక వసతిగృహాలు అందుబాటులో ఉన్నట్టు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ బి.రామ్‌కుమార్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంటర్‌లో చేరే వారు, ఉత్తీర్ణులై డిగ్రీ చదివిన వారు, పాసైన వారు విభిన్న ప్రతిభావంతులు ఈ వసతి గృహంలో వసతిపొంది విద్య అభ్యసించవచ్చన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్య బృందం అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారానికి(93940 04882) నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఒకరిపై దాడి.. కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : షాపు ముందు హారన్ కొట్టవద్దని చెప్పిన షాపు యజమానిపై వ్యాను డ్రైవర్ ఇనుప రాడ్డుతో దాడి చేసి గాయపరిచాడు.ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు నవాబ్‌పేట కాలనీకి చెందిన నూతిపిల్లి సాయిదుర్గా ప్రసాద్(25) ఏలూరు ఆదివారపుపేట సాయిబాబా గుడివద్ద మహాలక్ష్మి ఎలక్ట్రానిక్ షాపును నిర్వహిస్తున్నారు. చాటపర్రుకు చెందిన జిజ్జువరపు సాయి (26) ఒక వ్యాను వేసుకొచ్చి అతని షాపు ముందు ఆపి హారన్ కొడుతున్నాడు. దీంతో దుర్గా ప్రసాద్ ఎందుకు హారన్ వేస్తున్నావంటూ అడగడంతో జిజ్జువరపు సాయి వెంటనే బూతులు తిట్టుకుంటూ ఇనుపరాడ్డుతో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన అతనిని కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

31 మందికి ట్రై సైకిళ్ల అందజేత

చింతలపూడి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందని టీడీపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. స్థానిక సుబ్బరాజు హైస్కూల్ ఆవరణలో మంగళవారం వికలాంగులకు 31 ట్రై సైకిళ్లు అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు పది లక్షల రూపాయల విలువైన పరికరాలను అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సి.హెచ్.ధర్మరాజు, అట్లూరి శ్రీనివాసరావు, కె.శేషగిరిరావు, జనసేన నాయకులు చీదరాల మధుబాబు, బీజేపీ నాయకులు తోటా నారాయణ, మోహన్ రావు, విజయకుమారి, ఎంతఃవోలు రామారావు, కిరణ్ బాబు పాల్గొన్నారు.

మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో మలేరియా కేసులు పెరిగే అవకాశం ఉన్నందున ఏజెన్సీవాసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. మలేరియా కేసులు నమోదైన మోతుగూడెం, కోర్సవారిగూడెం గ్రామాల్లో మంగళవారం పర్యటించి గిరిజనులకు మలేరియా ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను, చర్యలను వివరించి అవగాహన కల్పించారు. మలేరియా నివారణకు దోమల మందును గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయించారు. దొరమామిడి పీహెచ్‌సీని సందర్శించి మలేరియా కేసుల రిజిస్టర్లు పరిశీలించారు. కేసులు వస్తున్నందున గ్రామాల్లో పర్యటించాలన్నారు. కార్యక్రమంలో పి.సౌమ్య, ఎస్‌యూవో పి.పెద్దిరాజు, హెచ్.వి.వసంత, ఎంపీ హెచ్ఏ బాలాజీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రం పాఠశాలలకు 'పాల్' ట్యాబ్‌ల అందజేత

(ఐదో పేజీ తరువాయి)

చదువుతున్న బాలబాలికలు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాల్ ల్యాబ్‌లకు వెళ్లి తర్ఫీదు పొందేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి ట్యాబ్‌లను పాఠశాలల్లో వినియోగించేలా మార్గదర్శకాలను జారీ చేసినట్టు సమగ్రశిక్ష ప్రతినిధి శ్రీహరి వివరించారు. ఈ ట్యాబ్‌లను స్కూలులోనే వినియోగించి, ప్రత్యేక ల్యాబ్‌లలోనే భద్రపర్చాల్సి ఉంటుందని, విద్యార్థుల ఇళ్లకు తీసుకెళ్లేందుకు అనుమతి ఉండదన్నారు.



నిర్మించి వదిలేసిన ప్రభుత్వ భవనం



తుప్పు పట్టి పాడైన ఏసీ



భవనం ఆవరణలో మద్యం బాటిళ్లు

నిరుపయోగం..

దశాబ్దాలుగా ప్రభుత్వ భవనాన్ని పట్టించుకోని వైనం - సద్వినియోగించాలంటూ విజ్ఞప్తులు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇదొక ప్రభుత్వ భవనం, ఇది ఉందనే మాటే మర్చిపోయారు సంబంధిత శాఖ అధికారులు. ప్రముఖ పుణ్యక్షేత్రంలో గత 24 ఏళ్లుగా ఈ భవనం నిరుపయోగంగా ఉంది. ప్రారంభం రోజున తెరుచుకున్న ఈ భవనం తలుపులు... కొత్తలో కొన్నాళ్లు అడపాదడపా మినహా ఇప్పటి వరకూ మరలా తెరుచుకోలేదు. దీంతో ప్రభుత్వనిధులు దుర్వినియోగం కావడమేకాకుండా ఇది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.నిత్యం అధికారులు ప్రజా ప్రతినిధులు ఈభవనం ముందునుంచే వెళ్తున్నా దీనివైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. మరికొందరైతే అసలు ఇటువంటి భవనం ఉందన్న సంగతే మర్చిపోయారు. ఈ భవనాన్ని అద్దెకు ఇచ్చి ఉంటే ప్రభుత్వానికి ఏటా లక్షలాది రూపాయల ఆదాయం వచ్చేది.

అతిథుల కోసమే నిర్మాణం..

శ్రీవారి దర్శనార్థం జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తుంటారు. అయితే వీరి సౌకర్యార్థం ఒక ప్రభుత్వ అతిథి గృహం ఉండాలన్న ఉద్దేశంతో 2001లో అప్పటి జడ్పీ ఛైర్మన్ కొక్కిరగడ్డ జయరాజు హయాంలో స్థానిక మావులేటి సోమరాజు సదనం ఎదురుగా ప్రధాన రహదారి పక్కన లక్షలాది రూపాయలు వెచ్చించి పంచాయతీరాజ్ శాఖ ఈ భవనాన్ని నిర్మించింది. భవనం కింద భాగంతో పాటు పై అంతస్తులో సైతం గదులకు ఏసీలను, కింది భాగం గదిలో మంచం, సోఫా, కుర్చీలు అమర్చారు. దీన్ని అప్పటి భారీపరిశ్రమల శాఖ మంత్రి కోటగిరి విద్యాధరరావు ప్రారంభించారు. ప్రారంభం తర్వాత దాని ఆలనాపాలన చూసేవారు లేక మూత పడింది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

క్షేత్రంలో వివాహాలు, ఇతర శుభకార్యాలు జరిగే సమయంలో చిన్నచిన్న గదులను వేలాది రూపాయలకు అద్దెకు ఇస్తుంటారు. ఆ సమయాల్లో దీన్ని అద్దెకు ఇస్తున్నా, లేదా లీజులకు ఇచ్చినా వేలాది రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరేది. అలాకాకుండా నిరుపయోగంగా వదిలేయడం వల్ల ఇది ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో కొందరు ఈ ప్రాంతంలో మద్యం తాగి సీసాలు, చెత్తను ఇక్కడ పడేస్తున్నారు.

పాడవుతున్న సామగ్రి

గదుల్లోని ఫర్నీచర్ దుమ్ముదూళి, బూజు పట్టి పాడైపోతోంది. అలాగే ఏసీలు తుప్పపట్టి పోతున్నాయి. ప్రస్తుతం క్షేత్రానికి వచ్చే ప్రజాప్రతినిధులు అధికారులకు వసతి కల్పించేందుకు ఇక్కడి అధికారులు దేవస్థానం పైనే ఆధారపడుతున్నారు. కనీసం దీన్ని వాడుకలోకి తెస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి దీనికి మోక్షం కల్పించాలని, ప్రభుత్వ ఆదాయవనరులను సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.



ఆహ్వానం పలుకుతున్న నాయకులు

మంత్రికి ఘన స్వాగతం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ పర్యటనలో భాగంగా జంగారెడ్డిగూడెం మీదుగా వెళ్తున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీకృష్ణ, చింతలపూడి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, టీడీపీ పట్టణాధ్యక్షుడు రావూరి కృష్ణ తదితరులు స్థానిక నిర్మలా హాస్పిటల్ వద్ద ఆహ్వానం పలికారు.

ఇంటర్‌లో ప్రవేశానికి ఆహ్వానం

పెదవేగి,ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : కొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి బాలికలను ఆహ్వానిస్తున్నామని హైస్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ ఆర్.శైలజ తెలిపారు. హైస్కూల్ ప్లస్‌లో బాలికలకు మాత్రమే ప్రవేశాలకు అవకాశం ఉందని, టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు అందుబాటులో ఉన్న కొప్పాక జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో చేరాలని కోరారు. ఈ మేరకు కొప్పాక చుట్టు పక్కల ఉన్న అంకన్నగూడెం, కొప్పాకగూడెం, బి.సింగవరం, వేల్పుచర్ల, చినబోయినపల్లి, పెదకడిమి, అమ్మపాలెం, భోగాపురం తదితర గ్రామాల్లో తిరుగుతూ అధ్యాపకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రచారంలో అధ్యాపకులు రత్నరాజు, ఏసురాజు, వాసు, రాజేంద్ర, గణేష్, నిర్మలకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల పక్షాన పోరాటం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పేదలు, ఆదివాసీల పక్షాన అహర్నిశలు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పోరాటాలు చేస్తోందని పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు ధర్మాల సురేశ్ అన్నారు. మండలంలోని గురుగుమిల్లి గ్రామంలో మంగళవారం పార్టీ 56వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను సురేశ్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల చట్టాలను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కారం రాఘవ, టి.బాబూరావు, కె.పోతురెడ్డి, ఈ.భూషణం, బి.వినోద్, పి.చిన్నన్న, వి.వెంకటేశ్వరరావు, కె.నాగార్జున, కె.కన్నారావు పాల్గొన్నారు.

అప్పనవీడులో అన్నదానం

పెదపాడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో అన్న దానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. ఏలూరుకు చెందిన దాత వడిసెల రాము ఆర్థిక సహకారంతో సుమారు 200 మందికి అన్నదానం నిర్వహించామన్నారు. మంగళవారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించి, అన్న ప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటుగా అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎల్‌ఎడ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : డీఎల్‌ఎడ్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన 3వ సెమిస్టర్ పరీక్షకు 44మంది, 1వ సెమిస్టర్ పరీక్షకు 89మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

'సంక్షేమ పథకాల అమలుకు సహకరిస్తాం'

దెందులూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు ఆధ్వర్యంలో ఈసమావేశం నిర్వహించారు. మండల అధికారులతో సంబంధిత శాఖలకు సంబంధించి ప్రభుత్వ పథకాలు, సంక్షేమ శాఖ కార్యక్ర మాలపై చర్చించారు. ముప్పవరం సర్పంచ్ మెండెం సంతోశ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు సర్పంచ్‌లు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ బత్తుల సుమతి, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చరుగ్గా రీసర్వే పనులు

నిడమర్రు ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : నాగనమిల్లి రైతులు తమ భూమి యాజమాన్య హక్కులకు సంబంధించి రీసర్వే కార్యక్రమంలో పాలుపంచుకుని తమహద్దులను, కొలతలను సరిచూసుకోవాలని నిడమర్రు తహసీల్దార్ నాగరాజు సూచించారు. మంగళవారం నిడమర్రు మండలం నాగనమిల్లిలో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలించి పనులు జరుగుతున్న తీరును సమీక్షించారు.

హజ్ యాత్రకు క్షేమంగా వెళ్లిరండి : షరీఫ్



హజ్‌యాత్రికులకు వ్యాక్సిన్ వేస్తున్న షరీఫ్

ఏలూరురూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ముస్లింలు హజ్‌యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని రావాలని శాసన మండలి మాజీ సభాపతి, ప్రభుత్వ సలహాదారు ఎం.డి.షరీఫ్ అన్నారు. మంగళవారం యునైటెడ్ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా హజ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.కె.నజీరుద్దీన్ ఆధ్వర్యంలో హజ్‌యాత్రకు వెళ్తున్న ముస్లింలకు మంగళవారం అంజుమన్ సంస్థ ప్రాంగణంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అల్లాదయతో పాదయాత్ర ఆనందకరంగా జరగాలని ఆకాంక్షించారు. యాత్రికులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనారోగ్య సమస్యలు ఎదురుకాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మెడికల్ వ్యాక్సినేషన్ చేయిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు ఎస్.కె.అజారుద్దీన్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 41మంది యాత్రకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ అధ్యక్షుడు జబీఉల్లా, ఎస్.కె.నాగూర్ జానీ, ఎం.డి.కాలీద్ అహ్మద్, ఎమ్డీ హుస్సేన్ షరీఫ్, ఎస్.కె జాబీర్ రెహ్మాన్, మెడికల్ అధికారి ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ సుధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పదోన్నతులు కల్పించాలంటూ వినతి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పని చేస్తున్న గ్రేడ్ -1 గ్రామ రెవెన్యూ అధికారులకు సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించాలంటూ మంగళవారం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ గ్రేడ్ -2 వీఆర్వోలకు గ్రేడ్ -1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వీఆర్వో సానుకూలంగా స్పందించి పదోన్నతుల విషయంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. వీఆర్వోని కలిసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మినారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్‌చంద్ర మూర్తి, నాయకులు అజయ్ పాల్గొన్నారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : అసంఘటిత కార్మిక రంగానికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, నగర కార్యదర్శి వై.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్ యార్డులో హమాలీ వర్కర్స్ యూనియన్ ముద్రించిన మేడే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మోదీ సర్కార్ తీసుకొచ్చిన కార్మికహక్కులు హరించి నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ఐఖ్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని కార్మికుల హక్కుల రక్షణకు ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్న వారిపై అర్బన్ నక్సల్స్ ముద్రవేసి కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. వీటికి వ్యతిరేకంగా మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.రమణ, ఎం.రాము, కె.అప్పారావు, జి.రమణ, దనన్‌విజయ్, వి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం పత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు



రాజేశ్వరిని సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

హెచ్ఎం రాజేశ్వరి పదవీ విరమణ సత్కారం

నిడమర్రు ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా రాజేశ్వరి సేవలు అమూల్యమైనవని జిల్లా డీసీఈబీ సెక్రటరీ సర్వేశ్వరరావు కొనియాడారు. మంగళవారం నిడమర్రు ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రాజేశ్వరి పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఎ.భాస్కరరావు, ఈ.శ్రీనివాసరావులు మండల ఉపాధ్యాయ బృందం తరపున ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం అసోసియేషన్ అధ్యక్షులు రమణ, ఉపాధ్యాయులు అడబాల అప్పారావు, దంగేటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ పేరాబత్తులతో పీఆర్టీయూ నాయకులు

ఎమ్మెల్సీ పేరాబత్తుల దృష్టికి సమస్యలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సమావేశాలు, సదస్సులు నిర్వహించుకునేందుకు భవనాన్ని అందించేందుకు చొరవ చూపాలంటూ ఏపీబీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.పి.ఆర్. విఠల్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలివ్వాలి, సంస్థలపై, ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి తక్షణం 12వ పిఆర్సీ కమిషన్ నియమించాలని కోరుతూ ఏలూరు జిల్లాశాఖ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వల ఆంజనేయులు ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌కి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను పరిష్కరించాలని, బదిలీలకు సంబంధించి అసంబద్ధంగా ఉన్న మార్గదర్శకాలను సవరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారని ఆంజనేయులు తెలిపారు.

వక్ఫ్‌చట్టంపై అసత్య ప్రచారం సరికాదు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దేశంలోని 97 శాతం మంది పేద ముస్లింల సొమ్ము కేవలం మూడు శాతం మంది ధనిక ముస్లింలే దోచేస్తున్నారని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.విక్రమ్‌కిశోర్ ఆరోపించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని ముస్లిలకు న్యాయం చేసేందుకు బీజేపీ కృషి చేస్తోందని అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో వక్ఫ్‌చట్టంపై అవగాహన కల్పించారు. కావాలనే విపక్షాలు బీజేపీపై అసత్య ప్రచారం చేస్తోందన్నారు. వక్ఫ్ సవరణలు పేద, ముస్లింల రక్షణ కోసం తీసుకొచ్చినట్టు తెలిపారు. వక్ఫ్ చట్టంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఇందుకూరి చక్రవర్తి వర్మ, ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కర్‌రావు, మైనార్టీ మోర్చా నాయకులు మీర్జాఫర్ అలీ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందజేస్తాం

పెదవేగి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో పింఛన్లు మంజూరుకోరుతూ విభిన్నప్రతిభావంతులు పలువురు ఎమ్మెల్యేకు వినతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పింఛన్లు పొందడానికి అర్హతే ప్రామాణికమని, పార్టీలకతీతంగా పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. దీనికి సంబంధించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని ప్రభాకర్ అధికారులను కోరారు.



రోడ్ల నిర్మాణం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

వేగివాడ ఎస్టీ కాలనీలో రోడ్ల నిర్మాణం

పెదవేగి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : వేగివాడ ఎస్టీ కాలనీలో రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరిశీలించారు. గుంతలతో అధ్వానంగా ఉన్న పుంతలాంటి దారిని పక్కా రహదారిగా మార్చడానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజావసరాలకు అనుగుణంగా రహదారి నిర్మాణం జరగాలని, డ్రెయిన్లను నిర్మించి మురుగు నిల్వలేకుండా సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నెక్కలపూడి సురేశ్ బాబు, ఈడ్పుగంటి అనిల్, కొనకళ్ల శివమణి, డి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఆక్యుప్రెజర్‌తో రోగాల నుంచి విముక్తి

పెదపాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఒక క్రమ పద్ధతి, నిపుణుల పర్యవేక్షణలో నిర్వహించే ఆక్యుప్రెజర్ ద్వారా పలు రోగాల నుంచి విముక్తి పొందవచ్చని పెదపాడు నీటి సంఘం అధ్యక్షులు బొప్పిడి కాశీబాబు తెలిపారు. సొసైటీ ఆవరణలో రాజస్థాన్‌కు చెందిన ఆరోగ్య జీవన్ సంస్థాన్‌కు చెందిన డాక్టరు రామ్ మనోహర్ లోహియా ఆధ్వర్యంలో ఉచిత ఆక్యుప్రెజర్ శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో ఆక్యుప్రెజర్ థెరపిస్టులు బీపీ, మూత్రపిండాల వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులకు ఆక్యుప్రెజర్ ద్వారా చికిత్స ఉందన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

టి.నర్సాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వెలగపాడు గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన పాకనాటి సత్యనారాయణకు ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.50 వేల చెక్కును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శీలం సాయివినయ్, జాజుల బుచ్చిబాబు, తుమ్మా నాగేశ్వరరావు, అంజిబాబు పాల్గొన్నారు.

పెట్టుబడిదారీ విధానంపై పోరాడుతాం

కుక్కునూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారి విధానాలకు వ్యతి రేకంగా సామూహిక ఐక్యపోరాటాలు చేస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్.కె.గౌస్ అన్నారు. మంగళవారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సామాజిక మార్పు కోసమే లెనిన్ ఆదర్శాలతో మార్క్సిజం ద్వారా పార్టీ ఆవిర్భావానికి పునాది పండిందన్నారు. సమావేశంలో నాయకులు నాయకులు కె.కల్లయ్య, ప్రశాంత్, ఎస్.కె.మున్నీ, సుభద్ర, రాణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డలకు తల్లిపాలే కీలకం : చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బిడ్డల ఆరోగ్యకర భవిష్యత్తుకు తల్లిపాలే కీలకమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ బిడ్డలకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందజేయాలన్నారు. కూటమి ప్రభుత్వం దీని పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో తల్లిబిడ్డలకు కూటమి ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కే.శారద, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

●ద్వారకాతిరుమల : ప్రతీ ఒక్కరూ మొబైల్, టీవీ వాడకాన్ని తగ్గించి ఆ సమయాన్ని కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.మేరీ సూచించారు. మండలంలో జరుగుతున్న పోషక పక్వాడ పక్షోత్సవాలు మంగళవారం గొల్లగూడెం అంగన్వాడీలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె పోషకాహార ప్రాముఖ్యతను గర్భిణులు, తల్లులు, కార్యకర్తలకు తెలియపరిచారు. అంగన్వాడీల నుంచి అందే పోషకాహారాన్ని లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జి.కొత్తపల్లి, గోపాలపురం సూపర్‌వైజర్లు లక్ష్మీరాజ్యం, మణి, ఏఎన్ఎం కె.సుజాత, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చంటికి మొక్కలు అందజేస్తున్న మహిళలు

●ఉంగుటూరు : ఆడపిల్లల్లో రక్త హీనతను తగ్గించడానికి రాగి, నువ్వులు వంటి బలమైన ఆహారం అందించాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి కస్తూరి శిరీష అన్నారు. మంగళవారం ఆడపిల్లల ఎదుగుదలకు అందించాల్సిన పోష కాహారం, ప్రొటీన్ల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి శిరీషతో పాటు మెటర్నిటీ అసిస్టెంట్ కృష్ణ కుమారి, యోగా శిక్షకురాలు జయలక్ష్మి, పెద్దిరాజు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న పితాని

ఉంగుటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : గోపీనాథపట్నంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్ల దివ్య విగ్రహ ప్రతిష్ఠ బుధవారం జరగనుంది. ఈ నెల 19వ తేదీ నుంచి జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, సాదిని కుమారి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వినియోగం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు

ముదినేపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి, నాగ ప్రతిమల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ, అర్చకులు రుద్రపాక బాలగంగాధర్ తిలక్, కోట శివశంకర శర్మ పూజలు జరిపారు.

వృద్ధురాలి అంత్యక్రియలకు వైష్ణవి సహాయం

ముదినేపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సంకర్షణపురంలో సోమవారం సాయంత్రం మరణించిన రేమల్లి రోజనమ్మ (75) అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.5 వేల నగదు సహాయం అందజేశారు. రోజనమ్మ బంధువులకు ఈ సహాయాన్ని వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ మంగళవారం అందజేశారు.

వైద్య ఆరోగ్య సేవలు సక్రమంగా నిర్వహించాలి



శిక్షణా తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ధీరజ్ కుమార్

కలిదిండి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య సేవలు సక్రమంగా నిర్వహించాలని కోరుకొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ధీరజ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో హెల్త్ మేనేజ్‌మెంట్, శిశు ఆరోగ్యంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సేవలు నాణ్యతను పెంపొందించాలన్నారు. ప్రతీనెల ఆరోగ్య సేవల రిపోర్టుల్లో మెరుగైన వైద్య సేవలు ఉండాలన్నారు. కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్, మూల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి నశీన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణకిశోర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ స్టేషన్‌లో వాటర్ కూలర్ ఏర్పాటు



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

ముదినేపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ఆర్టీసీ బస్ స్టేషన్‌లో తాగునీటి సౌకర్యం లేక ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ వాటర్ కూలర్ ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రమవుతున్న పరిస్థితుల్లో ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు మంగళవారం కూలర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఏలూరు ఆర్టీసీ డిపో సీఐ మురళి, బస్ స్టేషన్ కంట్రోలర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రం పాఠశాలలకు 'పాల్' ట్యాబ్‌ల అందజేత

(ఐదో పేజీ తరువాయి)

చదువుతున్న బాలబాలికలు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాల్ ల్యాబ్‌లకు వెళ్లి తర్ఫీదు పొందేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి ట్యాబ్‌లను పాఠశాలల్లో వినియోగించేలా మార్గదర్శకాలను జారీ చేసినట్టు సమగ్రశిక్ష ప్రతినిధి శ్రీహరి వివరించారు. ఈ ట్యాబ్‌లను స్కూలులోనే వినియోగించి, ప్రత్యేక ల్యాబ్‌లలోనే భద్రపర్చాల్సి ఉంటుందని, విద్యార్థుల ఇళ్లకు తీసుకెళ్లేందుకు అనుమతి ఉండదన్నారు.



బుట్టాయగూడెం మండలంలో జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

బుట్టాయగూడెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుట్టాయగూడెం మండలంలో మంగళవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.65 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయినేజి పనులను ప్రారంభించారు. రెడ్డిగణపవరం పంచాయతీ పల్లపూరు నిర్వాసిత కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 35 వేల మంది నిర్వాసితులను బయట ప్రాంతాలకు తరలించడం జరిగిందన్నారు. నిర్వాసితులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని, భూమిని ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన పేదలకు త్వరలో కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. ఏజెన్సీలో రోడ్లు, డ్రెయిన్ల మరమ్మతులకు, నిర్మాణాలకు రూ.27 కోట్లు ఇవ్వడం జరిగిందని మరో రూ.20 కోట్లు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ సుముఖంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వం సత్యసాయి మంచినీటి పథకాన్ని నిర్వీర్యం చేసిందని, కనీసం కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేదని, పథకం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్టీ నిర్వాసితులకు అంత్యోదయ అన్న యోజన కార్డులను ఇచ్చి నెలకు 35 కేజీల బియ్యాన్ని ఉచితంగా ఇస్తామన్నారు. ముందుగా 798 మందికి కార్డులు మంజూరుచేసి బియ్యాన్ని ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. నిర్వాసితుల కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. నిర్వాసితులు కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవని, ఉపాధి లేదని, శ్మశాన వాటిక లేదని, పూర్తిస్థాయి పరిహారం అందించాలని అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మంత్రిని తెలపగా చర్యలు తీసుకుంటామన్నారు.

● **జీలుగుమిల్లి**: మండలంలో రౌతుగూడెం, ఎర్రవరం నిర్వాసిత కాలనీల్లో గిరిజనుల సమస్యల్ని మంత్రి మనోహర్ అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో రాములు నాయక్‌ను ఆదేశించారు. నిర్వాసితుల ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి జనసేనలోకి అంకన్నగూడెం, తాటియాకులగూడెం, జీలుగుమిల్లికి చెందిన పలువురు పార్టీలో చేశారు. కటుకూరు నిర్వాసిత కాలనీలో వేలేరుపాడు మండల వాసులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో కలసి మంత్రికి శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో పౌర సరఫరాలశాఖ కమిషనర్ సౌరవ్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఆర్డీవో రమణ, ఐటీడీఏ పీవో రాములు నాయక్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, ఘంటా మురళి, గడ్డమణుగు రవికుమార్, కరాటం సాయి, పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, ములిశెట్టి యుగంధర్, తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్, సీఐ ఎస్సైలు వెంకటేశ్వరావు, నవీన్‌కుమార్, మేకా ఈశ్వరయ్య, అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

ఐరన్‌మాత్రల పంపిణీ



మాత్రలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

నూజివీడు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నూజివీడు క్యాంపస్‌లో విద్యార్థినులకు రక్తహీనత తలెత్తకుండా ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. దాదాపు 7వేల ట్యాబ్‌లెట్లను పంపిణీ చేయగా, రెండునెలల పాటు నిరంతరాయంగా మాత్రలను ఉపయోగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏవో డాక్టర్ లక్ష్మణ్, డీఎస్‌డబ్ల్యూలు సీతాపతి, టి.దుర్గాభవానీ, ఓ.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

నూజివీడు,ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రవేశాలతో పాటు ప్రస్తుత విద్యార్థుల ప్రగతి ఆమె పరిశీలించారు. మధ్యాహ్నం భోజన పథకం అమలుతీరు తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణం కమనీయం



ఆగిరిపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నెక్కలంగొల్లగూడెం అడ్డరోడ్డులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలైన పొట్లూరు వెంకటకృష్ణారావు దంపతులు, 125 మంది జంటలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీవారి రథోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దరఖాస్తులు చేసుకోండి

నూజివీడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులకు ఇళ్ల స్థలాల మంజూరుకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ బీవీ.సుబ్బారావు తెలిపారు. పట్టణంలో 2 సెంట్లు, మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో మూడు సెంట్లు చొప్పున మంజూరుకు నిర్ణయించడం జరిగిందని, గ్రామ సచివాలయాల్లో ఇంటిస్థలం కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

వూటుకూరు డ్రెయిన్‌లో కిక్కిస తొలగింపు



వూటుకూరు మీడియం డ్రెయిన్‌లో ఎక్స్‌కవేటర్ సాయంతో కిక్కిస తొలగింపు

ముదినేపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల ఆయకట్టు భూములకు మురుగునీటి పారుదల సౌకర్యం కల్పిస్తున్న వూటుకూరు మీడియం డ్రెయిన్‌లో కిక్కిస తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. ఏళ్ల తరబడి రైతులు ఎంత మొరపెట్టుకున్నా ముంపు సమస్య నివారణకు గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చొరవతో ఈ డ్రెయిన్‌లో కిక్కిస, గుర్రపు డెక్క తొలగింపు పనులను డ్రెయినేజీ శాఖ చేపట్టింది. ఈ మీడియం డ్రెయిన్ దిగువ భాగంలో సుమారు ఆరు కిలో మీటర్ల దూరం దట్టంగా పెరిగిన కిక్కిస తొలగింపునకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పంటు ఏర్పాటు చేశారు. ఆ పంటుపై ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి కిక్కిస తొలగించే పనులు నిర్వ హిస్తున్నారు. సుమారు రూ.16 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనులను నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ప్రారంభించగా, వణుదుర్రు నీటి సంఘం అధ్యక్షుడు పాండురంగారావు, మండల జనసేన కన్వీనర్ వెంకటేశ్వరరావు, డ్రెయినేజీ డీఈఈ కుమార్, ఏఈ భోగేంద్ర ప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు.

పెదలంక కాల్వ పనులు పూర్తి



కలిదిండి : దట్టంగా గుర్రపు డెక్క తూడు, చెత్తాచెదారం పేరుకుపోయిన పెదలంక - మూల్లంక కాల్వలో పూడిక తవ్వకం పనులు పూర్తయ్యాయి. ఈనెల 7న రూ.3.8 లక్షలతో చేపట్టిన పూడిక తవ్వకం పనులను డీసీ చైర్మన్ భోగేశ్వరరావు, ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో పూర్తి చేశారు. రెండు రోజుల్లో పెదలంక తాగునీటి చెరువును నింపడానికి నీటి వంతు విడుదల చేయనుండటంతో త్వరితగతిన కాల్వ పూడిక తవ్వకం పను లు పూర్తి చేశామని ఇరిగేషన్ ఏఈఈ ఫణికుమార్ తెలిపారు.



పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఆరోగ్యవంతమైన సమాజం మహిళలతోనే సాధ్యం

ముదినేపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించటం మహిళల చేతుల్లోనే ఉందని ఐసీడీఎస్ సింగరాయపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ బి.సుందరమ్మ అన్నారు. మంగళవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతీ మహిళ తన ఆరోగ్య రక్షణకు, రక్తహీనతను తగ్గించేందుకు పోషకాహారం తీసు కోవడంలో శ్రద్ధ చూపించాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఏఎన్‌ఎం సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు రత్న తులసి, సముద్రవేణి, రిబ్కా, వరలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



డ్రోన్ కెమెరా ప్రారంభిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్.. చిత్రంలో ఎమ్మెల్యే కామినేని,తదితరులు

కైకలూరులో 34 సీసీ కెమెరాల ఏర్పాటు : ఎస్పీ

కైకలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దోహద పడుతుందని, కైకలూరు టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో 34 సీసీ కెమెరాలను దాతల సహకారంతో ఏర్పాటు చేశామని ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. కైకలూరు రూరల్ పోలీసుస్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కైకలూరు టౌన్ పోలీసుస్టేషన్లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే కామినేని రూ.2 లక్షల విలువైన డ్రోన్ కెమెరాను ఎస్పీకి అందజేశారు.

ఎస్పీ మాట్లాడుతూ పోలీసుస్టేషన్ నుంచే ట్రాఫిక్ నియంత్రణను చేసే అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నామన్నారు. దాతలను ఎమ్మెల్యే, ఎస్పీ సత్కరించారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్, కైకలూరు టౌన్, రూరల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్, నియోజకవర్గంలోని ఐదు పోలీసుస్టేషన్ల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

కైకలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ప్రతీ అర్జీని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరు మండలం వరహాపట్నంలోని ఆయన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రజలు వారి సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ప్రజలు వారి ఇబ్బం దులను నాయకుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఇది దోహదపడుతుందన్నారు.

ముగిసిన పౌష్టికాహార పక్షోత్సవాలు

కైకలూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బాలింతలకు, గర్భిణులకు ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రామారావు అన్నారు. మంగళవారం కైకలూరు మండలం పెంచికలమర్రులో పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాల న్నారు.అంగన్వాడీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. కేంద్రంలోని 8 మంది చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేశారు. అంగన్వాడీ సూపర్వైజర్ షాహీదాఖనున్, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

ఖరీఫ్ మిగులు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



గురజలో ఖరీఫ్ మిగులు ధాన్యాన్ని సేకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ముదినేపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముదినేపల్లి మండలంలో నిల్వ ఉన్న మిగులు ధాన్యాన్ని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి జారీ చేసిన అనుమతుల ప్రకారం కొనుగోలు చేయడం వ్యవసాయశాఖ ప్రారంభించింది. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని గురజ గ్రామంలో ఖరీఫ్ ధాన్యాన్ని స్థానిక రైతు సేవా కేంద్రం ద్వారా సేకరించారు. మండలంలో సుమారు 645 మెట్రిక్ టన్నుల ఖరీఫ్ మిగులు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యవసాయశాఖ రంగంలోకి దిగింది. మండలంలో రబీలో పండించిన సుమారు 321 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా సేకరిస్తామని ఏడీఏ వెంకటమణి తెలిపారు. ఏవో వేణుమాధవ్, వ్యవసాయ సహాయకుడు శ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బలివేలో నీటి బావి మరమ్మతులకు చర్యలు



గ్రామస్థులతో మాట్లాడుతున్న మంత్రి

ముసునూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలివే గ్రామ అధ్యక్షుడు కాట్రు రామస్వామి తండ్రి గోపాలస్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం పరామర్శించారు. గోపాలస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సమస్యలను స్థానికుల నుంచి మంత్రి అడిగి తెలుసుకున్నారు. గ్రామ శివారులో నీటి బావి మరమతులు చేసి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరారు. రూ.50వేలు సొంత సొమ్మును గ్రామ పెద్దలకు మంత్రి అందజేసి బావి మరమతుల బాధ్యతను టీడీపీ గ్రామ అధ్యక్షుడు రామస్వామికి అప్పగించారు. కార్యక్రమంలో మానం గంటేశ్వరరావు, ఉప్పలపాటి గణేష్, చిన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు పోయింది.. ఖాతా ఖాళీ

చాట్రాయి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఓ రైతు పొరపాటున ఏటీఎం కార్డు పోగొట్టుకున్నారు. కార్డు దొరికిన ఇద్దరు యువకులు చాకచక్యంగా ఏటీఎం నుంచి రూ.32 వేలు తీసేసుకున్నారు.ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చాట్రాయి గ్రామానికి చెందిన రైతు కొండపల్లి వెంకటేశ్వరరెడ్డికి ఎస్‌బీఐ ఖాతా ఉంది. వ్యవసాయ పనుల హడావుడిలో ఈ నెల 6న ఏటీఎం కార్డును పోగొట్టుకున్నారు. మైలవరం, జనార్ధనవరం గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులకు ఆ కార్డు దొరికింది. చాలా మంది వరస నెంబర్లతో పాస్‌వర్డ్ పెడతారని ఈ యువకులు ఊహించారు. ఈ నెల 8న ఇద్దరు యువకులు చాట్రాయిలోని ఏటీఎంలో పాస్‌వర్డ్ ఎంటర్ చేయడంతో పని చేసింది. ఎస్‌బీఐ ఏటీఎం నుంచి 3 సార్లు, కేడీసీసీ ఏటీఎం నుంచి ఒకసారి మొత్తం రూ.32 వేలు డ్రా చేశారు.డబ్బు డ్రా చేసినట్టు ఖాతాదారు ఫోన్‌కు మెసేజ్ రావడంతో వెంటనే బ్యాంకుకు వెళ్లి ఏటీఎం కార్డు బ్లాక్ చేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు విష్ణుకుమార్, గిరిబాబును ఎస్సై అభినందించారు.

లిబరేషన్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం

ముసునూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలో సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ 57వ వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం నిర్వహించారు. మండల కార్యదర్శి వేముల బక్కయ్య ఎర్రజెండా ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లు, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ప్రజా సమస్యలు, ప్రభుత్వాల వైఫల్యాలపై లిబరేషన్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పి.భవాని, ఎ.వజ్రం, చిట్టిబాబు, సురేష్, చినబాబు, వేముల చంటి పాల్గొన్నారు.

కృష్ణారావుపాలెంలో గ్రామసభ

చాట్రాయి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కృష్ణారావుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిమటబోయిన పుల్లారావు అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. తాగునీటి ఎద్దడి నివారణ, పారిశుధ్యం మెరుగుదల అంశాలపై సభలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏడీఏగా చాముండేశ్వరి



నూజివీడు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగా ఆలూరి చాముండేశ్వరి నియమితులయ్యారు. నూజివీడు ఏడీఏగా పనిచేస్తున్న విద్యాసాగర్ జూన్ వరకు సెలవుపై వెళ్లడంతో చాముండేశ్వరి ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

సిద్ధార్థ విద్యార్థులకు మంత్రి అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభివృద్ధిలో గ్రామీణ ప్రాంత కళాశాలల పాత్ర అభినందనీయమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. జేఈఈ మెయిన్స్‌లో 97.69శాతం సాధించిన అరవ మధునై ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 989మార్కులు సాధించిన పి.ఆకాంక్ష, ప్రథ మ సంవత్సరంలో 465 మార్కులు సాధించిన జి.పూజిత తదితరులను మంత్రి సారథి అభినందించారు. కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపాల్ జి.శ్రీమన్నారాయణ, టి.అనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో త్రివిధ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన చిన్నారులు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో నూజివీడు త్రివిధ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గోదావరి ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో తమ పాఠశాలకు చెందిన మొత్తం 16మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

నిబంధనలు మీరితే కఠిన చర్యలు

నూజివీడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అన్నవరంలో ప్రాంతీయ ఉప రవాణా అధికారి కృష్ణవేణి మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరం అన్నారు. బాలలు వాహనం నడిపితే వాహన యజమాని, తల్లిదండ్రులు శిక్ష అనుభవించాలని, జరిమానాలు కట్టవలసి ఉంటున్నారు. వాహనంతో పాటు అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉండాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు రూ.30వేలు జరిమానా విధించినట్లు కృష్ణవేణి తెలిపారు.

పండుఈగ నివారణకు చర్యలు చేపట్టండి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మామిడిలో పండుఈగ ఉధృతి కనిపిస్తోందని, నివారణచర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి ఆర్.హేమ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పండుఈగ నివారణకు ఎర ఏర్పాటు చేయాలన్నారు. మగ ఈగ ఆకర్షింపబడి పండుఈగ ఉధృతి తగ్గుతుందన్నారు. ఎకరానికి నాలుగు నుంచి ఆరు ఎరలను ఏర్పాటు చేయాలన్నారు. ఉధృతి అధికంగా ఉంటే డెల్టా మేత్రిన్ 2.8ఈసీ 2మిల్లీలీటర్లు, 100 గ్రాములు బెల్లాన్ని లీటరు నీటికి కలిపి చెట్ల మొదళ్లలో పిచికారి చేయాలన్నారు. లేదా కాయకోతకు 3నుంచి 4 వారాల ముందు చెట్లపై పిచికారి చేయవచ్చని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

పాడి రైతులకు బోనస్ అందజేత



బోనస్ పంపిణీ చేస్తున్న అధ్యక్షుడు

చాట్రాయి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్ అనుబంధ, మండలంలోని జనార్ధనవరం పాల సహకార సంఘం సభ్యులకు బోనస్ పంపిణీ చేశారు. మూడో విడత బోనస్ రూ.49,530 సంఘం అధ్యక్షుడు కలకొండ బాలకృష్ణ మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేతన కార్యదర్శి రామస్వామి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475